**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 32, పేజీలు - 08

మంగళవారం, జులై 28, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించండి

**- తెలంగాణ సీఎస్‌కు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు**

**- ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సూచన - లోతుకుంట భూవ్యవహారంపై విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు**

**- 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తీవ్ర ఆగ్రహం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ ఏజెన్సీ కమిషనర్ ఏవీ రంగనాథ్ వైఖరిపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. మల్కాజ్‌గిరి మండలం లోతుకుంటలోని వివాదాస్పద భూముల్లో కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి కూల్చివేతలకు పాల్పడ్డారన్న పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, చట్టాన్ని, కోర్టు ఆదేశాలను పదేపదే ధిక్కరించడంపై మండిపడింది. ఈ క్రమంలో హైడ్రా సారథ్యం నుంచి రంగనాథ్‌ను వెంటనే తప్పించి, ఆయన స్థానంలో ఐజీ స్థాయి కలిగిన ఐపీఎస్ అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో సంచలనంగా మారింది. లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్లు 1, 2లలో ఉన్న 40 ఎకరాల భూవివాదంలో శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జరిగిన విచారణలో న్యాయస్థానం అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒకే అధికారిపై ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడం ఆశ్చర్యకరమని , వ్యవస్థలు చట్ట పరిధికి లోబడి నడుచుకోవాలి కానీ చట్టానికి అతీతంగా

2లో..

# చట్టపరంగా సమాధానం చెబుతా!

**హైకోర్టు ఆదేశాలపై హైడ్రా రంగనాథ్ రియాక్షన్**

**- రూ.1.50 లక్షల కోట్ల ఆస్తులు రక్షించామని వివరణ**

**- 26 చెరువుల పునరుద్ధరణ చేసామన్న హైడ్రా కమిషనర్**

**- భూమాఫియానే తనపై తప్పుడు కేసులు పెట్టిందని ఆరోపణ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆయన తొలిసారిగా స్పందించారు. తాము పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే విధులు నిర్వర్తించామని చెరువులు, ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తుల పరిరక్షణే హైడ్రా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, తనపై నమోదైన అన్ని కేసులను చట్టపరంగా ఎదుర్కొంటానని వెల్లడించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రంగనాథ్ ఇప్పటివరకు హైడ్రా ద్వారా సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించినట్లు తెలిపారు. ఇప్పటికే 6 చెరువులను పూర్తిగా పునరుద్ధరించగా మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. వేల ఎకరాల ఆక్రమిత ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని తెలిపారు. లోతుకుంట ప్రాంతంలో భారీ భూ కబ్జా యత్నాన్ని కూడా అడ్డుకున్నామని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. తనపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులపైనా ఏవీ

2లో..

## ప్రతిష్టంభనకు తెర

**- నేడే కీలక బిల్లుపై చర్చకు అధికార, విపక్షాలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షల్లో అక్రమాల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు కేంద్రం పలు చర్యలు చేపట్టింది. ఇందులో ప్రభుత్వ పరీక్షల నిర్వహణ బిల్లులో కీలక సవరణలు చేసింది. అయితే ఈ బిల్లుపై చర్చకు సోమవారం పార్లమెంట్ లో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సభా కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అధికార, విపక్షాలు ఏకాభిప్రాయానికి రావాలని స్పీకర్ కోరినా అంగీకరించకపోవడంతో లోక్ సభలో ప్రతిష్టంభన కొనసాగింది. ఈ నేపథ్యంలో తెరవెనుక అధికార, విపక్షాలు

2లో..

## కేటీఆర్ లీగల్ నోటీసుల వ్యూహం తప్పా.?

**- సీఎం రేవంత్ ఆరోపణలపై కోర్టుల్లో యుద్ధమా.?**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరు సరికొత్త మలుపులు తిరుగుతోంది. ఇంటర్మీడియట్ మార్కుల వివాదంతో ముడిపడిన గ్లోబ్‌ఎరీనా సంస్థ కేటీఆర్‌దేనని, అది ఆయన బినామీ కంపెనీ అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సంచలన ఆరోపణలపై కేటీఆర్ మరోసారి లీగల్ నోటీసు అస్త్రాన్ని ప్రయోగించారు. 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అయితే, రేవంత్ రెడ్డి విసురుతున్న తీవ్రమైన రాజకీయ ఆరోపణలను కేటీఆర్ మైదానంలో రాజకీయంగా తిప్పికొట్టకుండా, పదే పదే న్యాయస్థానాలు ,లీగల్ నోటీసుల వెనుక దాక్కుంటున్నారనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.

### ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు

గతాన్ని పరిశీలిస్తే కేటీఆర్ ఈ తరహా లీగల్ రూట్‌ను ఎంచుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి వైట్ ఛాలెంజ్ విసిరినప్పుడు, డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు కూడా ఆయన రాజకీయ సభల్లో రేవంత్‌ను గట్టిగా దెబ్బతీయడం కంటే కోర్టుల్లో కేసులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ వివాదం, బావమరిది ఫామ్‌హౌస్ రచ్చ, ఫార్ములా-ఈ రేస్ లీగల్ ప్రాసెస్, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల సమయంలోనూ పదుల సంఖ్యలో నాయకులకు లీగల్ నోటీసులు పంపారు. ఒక నాయకుడిగా తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఇది చట్టపరంగా సరైన మార్గమే అయినప్పటికీ, ప్రజాక్షేత్రంలో మాత్రం ఇది ఒక రకమైన రక్షణాత్మక శైలిగా కనిపిస్తోంది.

2లో..

## పెద్దిని పరామర్శించిన కేసీఆర్

**- అరగంట పాటు ఆసుపత్రిలో గడిపిన బీఆర్ఎస్ చీఫ్**

**- మెదడు పనితీరు సాధారణ స్థితికి రావాల్సి ఉందన్న వైద్యులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుకు గురై తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిని సందర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యుల ముందు చేతులెత్తి నమస్కరిస్తూ "ఏం చేస్తారో చేయండి, కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అని భావోద్వేగంగా విజ్ఞప్తి చేశారు. దాదాపు అరగంట పాటు ఆస్పత్రిలోనే ఉన్న కేసీఆర్ ఐసీయూలో అందుతున్న చికిత్స వివరాలను వైద్యుల నుంచి తెలుసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచస్థాయి వైద్యం అందిస్తున్నామని అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని యశోద ఆస్పత్రి వైద్య బృందం తెలిపింది. గుండె, ఊపిరితిత్తులు సహా ఇతర

2లో..

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించండి

**- సీఎం చంద్రబాబు ఆదేశాలు**

**- ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్న సీఎం**

**- ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచన**

**- ప్రజల అంచనాలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలని స్పష్టీకరణ**

**- విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం నిపుణుల సేవలు తీసుకోవాలని ఆదేశం**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుందన్న అంచనాల నేపథ్యంలో, రైతులను అప్రమత్తం చేసి వారికి పూర్తిస్థాయిలో అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ "ఎల్‌నినో వల్ల

2లో..

## మీకు మార్కులు రాకపోతే సీఎం నా మార్కులు తగ్గిస్తారు

**- విద్యార్థులతో మంత్రి లోకేశ్ వ్యాఖ్య**

**- మౌలిక వసతులున్నా అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉండటంపై అసంతృప్తి**

**- విద్యా సంస్కరణలు పూర్తయ్యాయి, ఇక ఫలితాలపై దృష్టి పెట్టాలని ఆదేశం**

**- మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యాకానుకలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్న మంత్రి**




అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో విద్యా రంగంలో సంస్కరణల పర్వం ముగిసిందని, ఇకపై కేవలం ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. విద్యార్థులకు మంచి మార్కులు రాకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు తన పనితీరుకు మార్కులు తగ్గిస్తారని, కాబట్టి విద్యార్థులంతా బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఉత్సాహపరిచారు. సోమవారం కృష్ణా జిల్లా కంకిపాడు


2లో..

మాటతప్పితే..

## తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం

**- ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదు**

**- కేంద్రం ప్రభుత్వంపై సీజేపీ సంచలన ఆరోపణలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వంపై నీట్ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై ఆందోళనలకు నేతృత్వం వహించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సంచలన ఆరోపణలు గుప్పించింది. తమకు ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోవడం లేదని సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ సోమవారం ఆరోపించారు. నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన నిరసనల్లో పాల్గొన్నవారిపై నమోదైన

2లో..

## ఇష్టానుసారంగా ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల పెంపు

**- దేశంలోనే మొదటి స్థానంలో హైదరాబాద్ - ఇలా అయితే సామాన్యులకు విద్య అందని ద్రాక్షే**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఒకప్పుడు విద్య అంటే జ్ఞాన దానం, నేడు విద్య అంటే లాభసాటి వ్యాపారం. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు చదువును ఒక సేవగా కాకుండా లాభాలు తెచ్చిపెట్టే వ్యాపారంగా మార్చేశాయి. ఫీజుల మోత, డొనేషన్ల బాదుడు, పుస్తకాలు-యూనిఫాంల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతూ అడ్డగోలుగా దోచుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఫీజులకి సంబంధించిన ఫిర్యాదులలో హైదరాబాద్ దేశంలోని అగ్రశ్రేణి నగరాలలో ఒకటిగా నిలిచింది. ఇతర మెట్రో నగరాలలో ఫీజుల పెరుగుదల సాధారణంగా 10 నుంచి 30

2లో..




## ప్రభుత్వ సేవలకు ఇక ఒకే సర్టిఫికెట్

**- తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం**

**- తెలంగాణలో కొత్తగా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్**

**- మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు**

**- రేషన్ కార్డు డేటా ఆధారంగా ఈ రిజిస్టర్‌ను నిర్వహించనున్న ప్రభుత్వం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు కుటుంబ వివరాల ధ్రువీకరణను ఒకే వేదికపైకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో 'ఫ్యామిలీ రిజిస్టర్' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రతి కుటుంబానికి ఒకే ప్రామాణిక

2లో..

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించండి

వ్యవహరించకూడదని కోర్టు స్పష్టం చేసింది. కేవలం ఒక జీవో ద్వారా ఉనికిలోకి వచ్చిన ఏజెన్సీ, సివిల్ కోర్టుల, హైకోర్టుల స్టే ఉత్తర్వులను పక్కనపెట్టి చర్యలు చేపట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తేల్చిచెప్పింది.హైకోర్టు కఠిన వైఖరితో స్పందించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టు ఆదేశాల మేరకు పూర్తిస్థాయి అఫిడవిట్‌ను దాఖలు చేశారు. న్యాయస్థానం సూచించిన విధంగా ఆయన తన అఫిడవిట్‌లో క్షమాపణ పత్రాన్ని పొందుపరిచారు. న్యాయవ్యవస్థపై, ఉన్నత న్యాయస్థానం గౌరవప్రతిష్ఠలపై తనకు అత్యున్నత గౌరవం ఉందని, కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించే ఆలోచన తనకు ఏమాత్రం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. పిటిషనర్ పేర్కొన్నట్లుగా తాము వివాదాస్పద 40 ఎకరాల స్థలంలోకి ప్రవేశించలేదని, వాస్తవానికి దాని పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించారని తన అఫిడవిట్‌లో నివేదించారు.హైడ్రా చేపడుతున్న చెరువులు, ఆక్రమణల పునరుద్ధరణ చర్యలు మంచివే అయినప్పటికీ, అనుసరిస్తున్న పద్ధతి రాజ్యాంగబద్ధంగా ఉండాలని కోర్టు హితవు పలికింది. పోలీసు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం మొత్తం హైడ్రా నిర్ణయాలపైనే ఆధారపడుతుండటాన్ని తప్పుబడుతూ, అధికారులకు చట్టం ముందు అందరూ సమానులే అనే భావన ఉండాలని పేర్కొంది. రాజ్యాంగబద్ధమైన జవాబుదారీతనం, పారదర్శకతను పునరుద్ధరించాలని ఐజీ స్థాయి అధికారికి నేతృత్వ బాధ్యతలు అప్పగించడమే సరైన మార్గమని న్యాయస్థానం స్పష్టం చేసింది.ఒకవైపు ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తున్నందుకు రంగనాథ్‌కు ప్రజాదరణ లభించినప్పటికీ, న్యాయస్థానాల ఆదేశాలను బేఖాతరు చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ఇకపై ఏ చట్టపరమైన చర్యలు చేపట్టినా కోర్టు ముందస్తు అనుమతులు మరియు నిర్దేశిత ప్రక్రియను తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఈ సంచలన తీర్పు స్పష్టం చేసినట్లయింది.

## చట్టపరంగా సమాధానం చెబుతా!

రంగనాథ్ స్పందించారు. అవన్నీ భూ కబ్జాదారులు చేసినవేనని ఆరోపణలు గుప్పించారు. హైడ్రా చేపడుతున్న చర్యలను అడ్డుకునేందుకు ల్యాండ్ మాఫియా తప్పుడు సమాచారంతో కోర్టులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు తనపై 63 కోర్టు ధిక్కరణ కేసులు నమోదయ్యాయని వాటన్నింటికీ చట్టపరంగా సమాధానం చెబుతానని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఆర్టికల్ 48ఏ స్ఫూర్తితో పనిచేస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు. నిజాయితీ, నిర్భయంతో విధులు నిర్వర్తించడమే హైడ్రా బలం అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ బాధ్యత అప్పగించినా 100 శాతం ఫలితాలు సాధించేందుకు కట్టుబడి ఉంటానని రంగనాథ్ వెల్లడించారు.

# పెద్దిని పరామర్శించిన కేసీఆర్

అవయవాలు స్పందిస్తున్నప్పటికీ మెదడు పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరో 48 గంటలు కీలకమని వివరించింది.యశోద డాక్టర్ల వివరణ తర్వాత మాట్లాడిన కేసీఆర్ చికిత్స ఖర్చు విషయంలో ఎలాంటి వెనుకంజ వేయబోమని పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ శాయశక్తుల సహకరిస్తుందని స్పష్టం చేశారు. డాక్టర్ల కృషి, దేవుని దయ, ప్రజల ఆశీర్వాదంతో పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుంటారని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఆ తర్వాత యశోద ఆస్పత్రిలో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్ వారికి ధైర్యం చెప్పారు. "దేవుడున్నాడు, డాక్టర్లు ఉన్నారు, అన్నీ సవ్యంగానే జరుగుతాయి. ధైర్యంగా ఉండండి" అంటూ వారికి మనోధైర్యం నింపారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కేసీఆర్ ఆస్పత్రికి వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

# కేటీఆర్ లీగల్ నోటీసుల వ్యూహం తప్పా?

### ఇలా నోటీసులు ఇవ్వాలనుకుంటే లెక్క ఉండదు!

రాజకీయాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజా క్షేత్రంలోనే వాటిని ఖండించాలి. రేవంత్ రెడ్డి ప్రజాదరణ పొందిన మాస్ లీడర్ శైలిలో ఘాటైన భాషతో, మీడియా వేదికలపై బహిరంగ దాడి చేస్తుంటే, కేటీఆర్ కూడా తన పద్ధతిలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ అదనంగా కార్పొరేట్ పద్ధతిలో లీగల్ నోటీసుల కాగితాలను ముందుకు తెస్తున్నారు. రేవంత్ చేసే ప్రతి ఆరోపణకు మైక్ ముందుకు వచ్చి గంటల తరబడి ఆధారాలతో కౌంటర్ ఇవ్వకుండా, కేవలం లీగల్ టీమ్‌తో నోటీసులు పంపడం వల్ల కేటీఆర్ దగ్గర రాజకీయంగా రేవంత్‌ను ఢీకొట్టే కంటెంట్ లేదా పవర్ లేదా అనే సందేహం సామాన్య ప్రజల్లోకి వెళ్తోంది. ప్రజాస్వామ్యంలో కోర్టు నోటీసుల కంటే ప్రజా కోర్టులోనే నిజానిజాలు తేలాలనేది మెజారిటీ ఓటర్ల భావన. ఈ లీగల్ నోటీసుల స్ట్రాటజీ వల్ల రేవంత్ రెడ్డికి రాజకీయంగా మరింత మేలు జరుగుతోందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. కేటీఆర్ నోటీస్ ఇవ్వగానే నేను దేనికైనా సిద్ధం, విచారణ జరిపిస్తా అని రేవంత్ రెడ్డి ఆ ఆరోపణలను మరింత గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఫలితంగా, గ్లోబరీనా లేదా ఇతర ఆరోపణలు మీడియాలో రోజుల తరబడి నానుతూ, కేటీఆర్‌కు ప్రతికూల ప్రచారంగా మారుతున్నాయి. ఒక రకంగా కేటీఆర్ పంపే నోటీసులే రేవంత్ రెడ్డి ఆరోపణలకు మరింత పబ్లిసిటీ తెచ్చిపెడుతున్నాయనే సత్యాన్ని బీఆర్ఎస్ వ్యూహకర్తలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

### రాజకీయంగా చేసే ఆరోపణన్నిటినీ ప్రజలు నమ్మరు!

మాజీ మంత్రిగా, ఒక సమర్థవంతమైన పాలకుడిగా ఐటీ రంగాన్ని నడిపిన కేటీఆర్, చట్టపరమైన ప్రక్రియ ద్వారా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనుకోవడం సాంకేతికంగా సరికావచ్చు. కానీ, తెలంగాణ వంటి హై-ఓల్టేజ్ రాజకీయాలు నడిచే రాష్ట్రంలో కార్పొరేట్ తరహా లీగల్ బెదిరింపులు పొలిటిక్స్‌లో పనిచేయవు. శత్రువు విసిరిన బాణాన్ని చట్టంతో కాకుండా, అంతకంటే పదునైన పొలిటికల్ అస్త్రంతో తిప్పికొట్టినప్పుడే కేడర్‌లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రతి అంశంపై సభలు, సమావేశాలు పెట్టి ఆధారాలతో ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టకపోతే ఆయనకు రాజకీయంగా రేవంత్‌ను ఎదుర్కొనే సత్తా తగ్గుతోందనే ప్రచారం నిజమేనని ప్రజలు నమ్మే ప్రమాదం ఉందని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# ప్రతిష్టంభనకు తెర

ఇవాళ ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.స్పీకర్ ఓం బిర్లా సూచన మేరకు ఈ కీలకమైన బిల్లులో విపక్షాలు సూచిస్తున్న సవరణలకు అధికార ఎన్డీయే అంగీకారం తెలిపినట్లు సమాచారం. దీంతో నేడు లోక్ సభలో ఈ బిల్లుపై చర్చ జరగనుంది. ఇందులో ఇండియా కూటమి తరపున విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు ఇతర ఎంపీలు, అలాగే అధికార ఎన్డీయే నుంచి మంత్రులు మాట్లాడనున్నారు. అనంతరం ప్రధాని మోదీ సమాధానం ఇవ్వబోతున్నారు.ఈ బిల్లుపై జరిగే చర్చలో కాంగ్రెస్ పాల్గొంటుందని ఆ పార్టీ నేతలు తెలిపారు. లోకసభలో 'పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) సవరణ బిల్లు, 2026'పై చర్చకు మొత్తం 8 గంటల సమయం కేటాయించారు. అయితే, ప్రతిపక్షాల తుది వ్యూహం మాత్రం మంగళవారం ఉదయం పార్లమెంటులో జరిగే ప్రతిపక్ష సభాపక్ష నాయకుల సమావేశంలో ఖరారు కానుంది. అనంతరం ఈ బిల్లుపై లోక్ సభలో ముందుగా చర్చ ప్రారంభం కానుంది. లోక్ సభలో బిల్లు ఆమోదం తర్వాత ఎల్లుండి రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశం ఉంది.

# ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించండి



ఎదురయ్యే పరిణామాలను రైతులకు స్పష్టంగా వివరించాలి. ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలో సూచిస్తూ, వారిని ప్రత్యామ్నాయ సాగు వైపు ప్రోత్సహించాలి. దీనికోసం ఒక క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ప్రజల ఆలోచనలకు అనుగుణంగా మారాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు అందడంలో కొంత అంతరం కనిపిస్తోందని అన్నారు. ఇటీవల ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఆయన అధికారుల వద్ద ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దానికి తగ్గట్టుగా ఉద్యోగులు పనిచేయాలని హితవు పలికారు. రంపచోడవరం విద్యార్థిని శివాని ఆత్మహత్య ఘటనపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చదువులో టాపర్‌గా ఉన్న విద్యార్థిని చనిపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు సైకో మెట్రిక్ టెస్టులు నిర్వహించాలన్న విద్యాశాఖ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం నిపుణుల సేవలు తీసుకోవడంతో పాటు, ఉపాధ్యాయులకు కూడా అవసరమైన శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మీకు మార్కులు రాకపోతే

# సీఎం నా మార్కులు తగ్గిస్తారు

మండలం పునాదిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంత్రి లోకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, విద్యా ప్రమాణాలపై సుదీర్ఘంగా ఆరా తీశారు.

### పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి

తనిఖీలో భాగంగా మంత్రి లోకేశ్ నేరుగా పదో తరగతి 'ఏ' సెక్షన్ గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గతేడాది ఈ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం కేవలం 67 శాతంగా ఉంది. ఇది రాష్ట్ర సగటు కంటే 11 శాతం తక్కువ. మీ సీనియర్ల కంటే మీరు బాగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్ అనేవి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశలు. నా జీవితంలో కూడా ఆ సమయంలోనే మార్పు వచ్చింది. ఇప్పుడు కష్టపడి మంచి మార్కులు తెచ్చుకుంటేనే మీ భవిష్యత్తు బంగారుమయమవుతుంది" అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.

### చిక్కీకే ఎక్కువ మంది ఓటు

అనంతరం పాఠశాలలో అమలవుతున్న 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్' అందజేత, మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు బదులిచ్చారు. ప్రజాప్రభుత్వంలో మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం (ఫైన్ రైస్) అందిస్తున్నామని తెలిపారు. "మీలో రాగిజావ ఎంతమందికి ఇష్టం, చిక్కీ ఎంతమందికి ఇష్టం?" అని మంత్రి సరదాగా ప్రశ్నించగా, ఎక్కువ మంది చిక్కీకే ఓటేశారు.పాఠశాలలో మౌలిక సదుపాయాలకు 2.76 రేటింగ్ ఉన్నప్పటికీ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు (లెర్నింగ్ అవుట్‌కమ్స్) కేవలం 0.9 శాతం రేటింగ్‌తో చాలా తక్కువగా ఉండటంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "అద్భుతమైన వసతులు, మంచి ఉపాధ్యాయులు ఉన్నా ఫలితాలు ఎందుకు రావడం లేదు? పట్టణానికి దగ్గరగా ఉన్న పాఠశాలలో ఈ పరిస్థితి ఆమోదయోగ్యం కాదు" అని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరు కావడాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

### సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రెండూ ముఖ్యమే

విద్యావ్యవస్థ విజయవంతం కావాలంటే సాఫ్ట్‌వేర్ (బోధన), హార్డ్‌వేర్ (వసతులు) రెండూ ముఖ్యమేనని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇంటర్మీడియట్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే వొకేషనల్ కోర్సుల ల్యాబ్‌లపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. 340 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ఫలితాల్లో గణనీయమైన మార్పు కనిపించాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారికి ఆటోగ్రాఫ్‌లు ఇచ్చి ఉత్సాహపరిచారు.

# మాటతప్పితే.. తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం



కేసులను ఉపసంహరించుకుంటామని చర్చల సమయంలో కేంద్ర మంత్రులు హామీ ఇవ్వడంతోనే తాము ఉద్యమాన్ని విరమించామని దాస్ పేర్కొన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర ఆందోళనకారులపై పెట్టిన కేసులను కేంద్రం వెనక్కి తీసుకోలేదని ఆయన తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లోని పలుచోట్ల ఆందోళనకారులను అరెస్టు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని సౌరవ్ అన్నారు. ఈ కేసులకు సంబంధించి సీనియర్ లాయర్లను సంప్రదిస్తున్నామని ఆయన వివరించారు. అంతేకాదు, చర్చల సమయంలో తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నామని సౌరవ్ దాస్ తెలిపారు. జులై 28 (మంగళవారం)లోగా దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన అన్ని కేసులను ఎత్తివేయాలని, నిర్బంధంలో ఉన్నవారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కానీపక్షంలో తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ అంశంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా సీజేపీ నేతృత్వంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు ఉద్ధృతం కావడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కేంద్రానికి సీజేపీ చేసిన ప్రధానమైన మూడు డిమాండ్లలో ప్రధాన్ రాజీనామా కూడా ఒకటి. నీట్ లీక్ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లింపు, దేశవ్యాప్తంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని సీజేపీ డిమాండ్ చేసింది. వీటికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించడంతో నిరసనలను విరమిస్తున్నట్టు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది.

# ఇష్టానుసారంగా ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల పెంపు

శాతం వరకు ఉండగా హైదరాబాద్‌లో మాత్రం ఎలాంటి నిబంధనలు లేకపోవడం వల్ల కొన్ని ప్రైవేటు స్కూళ్లు ఏకంగా 40 నుంచి 50 శాతం మేర, కొన్ని సందర్భాల్లో 100 శాతం వరకు ఫీజులను పెంచుతున్నాయని ఇండియన్ వెబ్ ఆఫ్ పేరెంట్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యూపీఏ) అధ్యక్షురాలు అనుభా సహాయ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని మెజారిటీ తల్లిదండ్రుల నుంచే తమకు అత్యధిక ఫిర్యాదులు అందుతున్నాయని, బెంగళూరు రెండో స్థానంలో ఉందని ఆమె తెలిపారు. చాలా కుటుంబాలకు పాఠశాల విద్య ఖర్చులు హోమ్ లోన్ ఈఎంఐలను తలపించేలా భారంగా మారుతున్నాయన్నారు. ఇటీవల కెనడా నుంచి నగరానికి తిరిగి వచ్చిన ఓ మహిళ మాట్లాడుతూ తన ఏడేళ్ల కూతురి స్కూల్ ఫీజు గురించి ఆశ్చర్యకర విషయాలు వెల్లడించారు. ట్రాన్స్‌పోర్టుతో కలుపుకొని ఏడాదికి రూ. 3 లక్షలకు పైగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. తమ ఇంటి లోన్ ఈఎంఐ రూ. 40 వేలు ఉంటే, కూతురి స్కూల్ నెలకు ఫీజు రూ. 22 వేల వరకు ఉందని, 10 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఫీజులు ఇంతరా పెరిగిపోవటం తనను ఆశ్చర్యపరిచిందని ఆమె వెల్లడించారు. ఫీజులు విపరీతంగా ఉండటం వల్లే తాము కేంబ్రిడ్జ్ సిలబస్ బదులుగా సీబీఎస్ఈని ఎంచుకోవాల్సి వచ్చిందని చెప్పారు.

తమ పిల్లల ఫీజులను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఒక్కసారిగా భారీగా పెంచేసిందని పేట్‌బషీరాబాద్‌కు చెందిన మరో మహిళ వాపోయారు. గతేడాది ప్రైమరీ చదువుతున్న ఇద్దరు పిల్లలకు వరుసగా రూ. 23 వేలు, రూ. 22 వేలు చెల్లిస్తే ఈ ఏడాది ఆ ఫీజులు రూ. 40 వేలు, రూ. 58 వేలకు పెంచినట్లు తెలిపారు. రసీదుల ఆధారంగా ఒకరి ఫీజు సుమారు 74 శాతం పెరిగితే మరో అబ్బాయికి ఏకంగా 164 శాతం పెరిగిందని దీనివల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు.ఈ రకమైన ధోరణి కారణంగా విద్య అప్పర్ మిడిల్ క్లాస్ మినహా ఇతరులకు అందని ద్రాక్షలా మారుతోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, విద్యావేత్త ఆకునూరి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది కుటుంబాలు తమ నెలవారీ ఆదాయంలో 50 శాతాన్ని స్కూల్ ఫీజులకే ఖర్చు చేస్తున్నాయని, మంచి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే ఉద్దేశంతో గిగ్ కార్మికులు కూడా రెట్టింపు కష్టపడి సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వాలు విద్యకు తక్కువ బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే ప్రజలు ప్రైవేట్ స్కూళ్ల వైపు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ విద్యా కమిషన్ సూచనలు అమలవకపోవటం దురదృష్టకరమని అన్నారు.పాఠశాలలను ప్రశ్నిస్తే తమ పిల్లలను టార్గెట్ చేస్తారనే భయంతో చాలా మంది తల్లిదండ్రులు మౌనంగా ఉంటున్నారని అనుభా సహాయ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు పరిమితంగా ఉండటం, అందరికీ కేంద్రీయ విద్యాలయాల్లో సీట్లు రాకపోవడం వల్ల ప్రత్యామ్నాయాలు కరువయ్యాయని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్‌లోని అనేక అంతర్జాతీయ పాఠశాలలు ఫీజుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచకుండా పారదర్శకతను విస్మరిస్తున్నాయని హైదరాబాద్ ప్రైవేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి బీవీకే కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే సామాన్యుల పిల్లలు చదువుకు దూరం కావాల్సిందేనని హెచ్చరించారు.

# ప్రభుత్వ సేవలకు ఇక ఒకే సర్టిఫికెట్

కుటుంబ రికార్డు అందుబాటులోకి రానుంది. రేషన్ కార్డు డేటాను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సభ్యుల వివరాలను ఒకే రిజిస్టర్‌లో నమోదు చేయనుంది.ఆ తర్వాత మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా ప్రజలు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. దరఖాస్తు చేసిన తర్వాత కేవలం రెండు పని దినాల్లోనే సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని తీసుకురావాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం తగ్గనుంది.ఒకే కుటుంబ రికార్డుతో వివిధ ప్రభుత్వ సేవలను పొందే అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు సమయం, శ్రమ ఆదా చేయడంతో పాటు సేవల్లో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం వేర్వేరు ప్రభుత్వ సేవల కోసం వేర్వేరు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి వస్తుండగా ఫ్యామిలీ రిజిస్టర్ అమల్లోకి వచ్చిన తర్వాత ఒకే అధికారిక కుటుంబ రికార్డు ఆధారంగా అనేక సేవలు పొందే వీలు కలగనుంది. త్వరలోనే ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.ఈ కొత్త విధానం అమలై ఫ్యామిలీ రిజిస్టర్ అందుబాటులోకి వస్తే ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు, ఇతర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఫ్యామిలీ రిజిస్టర్‌లో కుటుంబ పెద్ద పేరుతోపాటు అందరు కుటుంబ సభ్యుల వివరాలు, కుటుంబ పెద్దతో వారి సంబంధం, వయసు, పుట్టిన తేదీ, కుటుంబం పూర్తి నివాస చిరునామా కూడా ఉండనున్నాయి. ఇది ఆస్తిపై ఎలాంటి చట్టపరమైన హక్కును, యాజమాన్యాన్ని కల్పించదని చట్టబద్ధమైన వారసత్వానికి రుజువుగా కూడా పరిగణించలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా ఈ ఫ్యామిలీ రిజిస్టర్ ఎవరినీ సంక్షేమ పథకాలకు అర్హులుగా చేయదని స్పష్టం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన ఫార్మాట్‌లో ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం జారీ చేయనుంది.

## దారి మైసమ్మ అమ్మవారి

# వార్షికోత్సవం, అన్నదానం..



**జమ్మికుంట** జమ్మికుంట కారు ఓనర్స్ మరియు డ్రైవర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాంసాని శంకరయ్య, ఆధ్వర్యంలో సోమవారం హుజురాబాద్ రోడ్డులో గల పాల కేంద్రం వద్ద దారి మైసమ్మ అమ్మవారి మొదటి సంవత్సరం వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి అలంకరణ కార్యక్రమం పూజారుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు 200 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కారు డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాంసాని శంకరయ్య లతోపాటు మాచర్ల వినయ్ కుమార్, మహమ్మద్ రఫీక్, సమ్మయ్య, కొమురయ్య, మిరియాల్ కార్ రాజు, అక్బర్, రాజేష్, లచ్చన్న లతోపాటు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# ప్రజావాణికి 21 దరఖాస్తులు



**కరీంనగర్** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతిలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 5, టౌన్ ప్లానింగ్ 11, రెవెన్యూ 1, శానిటేషన్ 3, ఇందిరమ్మకు 1 చొప్పున మొత్తం 21 దరఖాస్తులు వచ్చాయి. ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, పన్ను సవరణ, నూతన ఆస్తి, నల్లా కనెక్షన్, నీటి సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డీసీపీ బషీరొద్దీన్, సూపరింటెండెంట్ షాహిదా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రైతు బజార్‌లో అధికారుల పరిశీలిన




**జగిత్యాల** జగిత్యాల పటణంలోని రైతు బజార్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్ అరవ లక్ష్మి సంయుక్తంగా రైతు బజార్ను పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతు బజార్ వెలుపల రహదారిపై కూర్చొని కూరగాయలు విక్రయిస్తున్న రైతులతో అధికారులు మాట్లాడారు. అనంతరం వారిని రైతు బజార్ లోపలికి వెళ్లి విక్రయాలు నిర్వహించాలని సూచించి, లోపలికి పంపించారు. రైతు బజార్లో ఉన్న హోల్సేల్ వ్యాపారులతో అధికారులు చర్చించారు. హోల్సేల్ వ్యాపారులు ఒక వైపు మాత్రమే వ్యాపారం నిర్వహించేలా, రైతులకు ప్రత్యేకంగా స్థలం కల్పించి వారు రైతు బజార్ లోపలే విక్రయాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రజలకు కూడా అసౌకర్యం లేకుండా రైతు బజార్లో క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ అధికారులకు ఆదేశించారు. రైతులు కూడా రహదారులపై కాకుండా రైతు బజార్ లోపలే విక్రయాలు నిర్వహించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, టీపీబీఓ శ్రీకర్, శానిటరీ ఇన్స్పెక్టర్ చందు, రాజేష్, రవి, అరుణ్, రమేష్, అశోక్, లక్ష్మీనారాయణ, విష్ణు, వివేక్ తదితర మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం విజయ్ సర్కార్‌కు ఎదురుదెబ్బ

## - కరూర్ బాధితుల నియామకాలు రద్దు



చెన్నై (ప్రశ్న న్యూస్) కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ నియామకాలు రాజ్యాంగంలోని 14, 16 అధికరణాలకు (సమానత్వపు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు) విరుద్ధమని పేర్కొంటూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. "విషాదకర ఘటనలు సంభవించినప్పుడు పరిహారంగా ప్రభుత్వ ఉద్యోగాలను పంపిణీ చేయలేరు. ఇది ఇప్పటికే కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి, విధి నిర్వహణలో ఉండి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అన్యాయం చేయడమే అవుతుంది" అని కోర్టు అభిప్రాయపడింది. ఇటువంటి నియామకాలను అనుమతిస్తే భవిష్యత్తులో అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల వంటి ఇతర ఘటనలు జరిగినప్పుడు కూడా బాధితులు ఇదే తరహా డిమాండ్లు చేసే ప్రమాదం ఉందని ధర్మాసనం హెచ్చరించింది.

గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్?లో ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నిర్వహించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, తన కరూర్ పర్యటనలో బాధితుల కుటుంబాలకు చెందిన 31 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు. వారిలో ఇప్పటికే 29 మంది విధుల్లో చేరారు. ఈ నియామకాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమని తేల్చింది. నేరుగా ఉద్యోగాలు కల్పించడానికి బదులుగా బాధితుల కుటుంబ సభ్యులకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక శిక్షణ వంటివి అందించి, వారు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలని ప్రభుత్వానికి సూచించింది.

# శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ,బాధ్యతాయుతమైన వ్యక్తిత్వం, సేవాభావం, క్రమశిక్షణను పెంపొందించే లక్ష్యంతో విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి వాస్తవ్యులు తేజో భారత్ వ్యవస్థాపకురాలు, సామాజిక సేవకు 2020లో సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు గ్రహీత శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు మెంబర్ విశాలి ఆనంద్ విచ్చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి నాయకులు, నాయకత్వం అనేది కేవలం పదవి కాదు, బాధ్యతతో కూడిన సేవ అని అన్నారు. ప్రతి విద్యార్థిలో ఆత్మవిశ్వాసం,నిర్ణయ సామర్థ్యం, జట్టుగా పనిచేసే నైపుణ్యం ఉండాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ . పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థి నాయకుల ఎన్నికలు నిర్వహించి ఫలితాలను ప్రకటించి, విజయం సాధించిన విద్యార్థులకు గౌరవప్రదంగా బ్యాడ్జలను ప్రదానం చేసి వారి బాధ్యతలను అధికారికంగా అప్పగించడం శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రత్యేకత అన్నారు.బ్యాడ్జను ధరించిన విద్యార్థే,రేపు సమాజానికి మార్గదర్శకుడవుతాడు అని సందేశం ఇచ్చారు.ఏ.జి.ఎం సురేష్ మాట్లాడుతూ వినూత్న విద్యా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసానికి శ్రీ చైతన్య పాఠశాల నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలాజీ, శ్రీనివాస్,డీన్ త్రివేణి, ఇన్చార్జులు శ్రీహరి,వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చర్లపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ గురువారం చర్లపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలు, రికార్డుల పరిశీలించారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో, నమోదు చేస్తున్న వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య శాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు పోర్టళ్లలో నమోదు చేసి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం వ్యాక్సిన్ల నిల్వ కోసం వినియోగిస్తున్న ఐఎల్‌ఆర్ రిఫ్రిజిరేటర్‌ను తనిఖీ చేసి, వ్యాక్సిన్లకు అవసరమైన ఉష్ణోగ్రత నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వొద్దని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని డా. ఆనంద్ సూచించారు. జ్వరాల సర్వేలు ముమ్మరం చేయడంతో పాటు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎక్కడైనా జ్వర కేసులు గుర్తించిన వెంటనే ఫాలోఅప్ చేసి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించేలా మందులు, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో డా. కె. ఆనంద్ పేర్కొన్నారు.

# తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు పారిశ్రామికవేత్తగా మారే అవకాశం ఉంటుంది

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) సోమవారం తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకం పై రైతులకు కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు మహిపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు సమావేశం లో ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్, డిఆర్డిఓ శ్రీనివాసరావు, రైతులు ప్రజాప్రతినిధులతో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో రైతులు మరియు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో అదనపు ఆదాయాన్ని, ఆర్థిక భద్రతను అందించే ముఖ్యమైన వ్యవసాయాధారిత, ఉద్యాన అనుబంధ రంగాలుగా చెప్పుకోవచ్చు అన్నారు.నిరుద్యోగ యువత, మహిళలు, రైతులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు. కల్పించబడతాయి అన్నారు.: ప్రభుత్వ పథకాల ద్వారా సబ్సిడీలు, శాస్త్రీయ పద్ధతిలో శిక్షణా కార్యక్రమాల ఏర్పాటు. చేస్తున్నట్లుఅదనపు ఆదాయం పెంపొందించే విధంగా



తేనె, పుట్టగొడుగుల ఉత్పత్తులకు మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని యూనిట్ల ఏర్పాటు. చేసుకోవాలన్నారు.

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ**



తక్కువ పెట్టుబడితో కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల సాగు. తేనెటీగల పెంపకం ద్వారా అదనపుఆదాయవనరులు. సమకూరుతాయన్నారు : ఉద్యాన వన మరియు పట్టు పరిశ్రమ శాఖల ద్వారా అందే సబ్సిడీలు, శిక్షణ వివరాలు. సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి సర్పంచ్ కృష్ణ గౌడ్ మపాల్ రెడ్డి అధ్యక్షులు రామా గౌడ్ రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే కలెక్టర్ స్పందన

## చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ

## నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు, ఇతర సమస్యలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే స్పందించిన కలెక్టర్ ఆ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా, వారితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? నాణ్యతా ఎలా ఉంది? అని ఆరా తీశారు. బియ్యం, పప్పులు, కోడిగుడ్లు, నూనె ఇతర ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. అక్కడి నుంచి విద్యార్థుల వసతి గదులకు వెళ్లి.. టాయిలెట్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**వెంటనే సమస్యలు పరిష్కరించాలి**

విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా ను పిలిపించి.. జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వేములవాడ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇటీవల తనిఖీ చేసి.. నిర్వహణలో లోపాలను గుర్తించారు. విచారణ నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ను జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం



ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి పాఠ్యాంశం కీలకమని ప్రణాళిక ప్రకారం చదవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వసతులను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలి

## అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి అదనపు కలెక్టరు (106) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ ట్రాఫిక్ సమస్యను పరిష్కారం

## టౌన్ సీఐ కరుణాకర్ , ట్రాఫిక్ ఎస్ఐ? మల్లేష్,మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్

## - రోడ్డుపై వ్యాపారం చేస్తున్న కూరగాయల వ్యాపారులను రైతు బజార్‌లోకి తరలింపు



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల పట్టణంలోని శ్రీ రామ టాకీస్ వద్ద గల రైతు బజార్ పరిసర ప్రాంతంలో కూరగాయల వ్యాపారులు రహదారులపై వ్యాపారం నిర్వహించడం వల్ల గత కొంతకాలంగా తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడి, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో శాశ్వత పరిష్కారం దిశగా పోలీసు ట్రాఫిక్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టారు.జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో , ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ , మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ ,ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా రైతు బజార్ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.డ్రైవ్ సందర్భంగా రహదారులపై వ్యాపారం నిర్వహిస్తున్న హోల్‌సేల్ రిటైల్ కూరగాయల వ్యాపారులతో సమావేశమై, రోడ్డుపై వ్యాపారం వల్ల ప్రజలకు, ట్రాఫిక్‌కు కలుగుతున్న ఇబ్బందులను వివరించి, రైతు బజార్ ప్రాంగణంలోనే వ్యాపారం నిర్వహించాలని అవగాహన కల్పించారు. అధికారుల విజ్ఞప్తికి వ్యాపారులు సానుకూలంగా స్పందించి, స్వచ్ఛందంగా రైతు బజార్‌లోకి వెళ్లి తమ వ్యాపారాలను ప్రారంభించారు.ఇకపై రైతు బజార్ వెలుపల రహదారులపై కూరగాయల వ్యాపారం నిర్వహించకుండా అందరూ సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# సింగరేణి పెన్షన్‌దారులకు రూ.30 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలి

**తాండూర్:**దసింగరేణి కోల్ మైన్స్‌లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పెన్షన్‌దారులకు ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, యూనియన్ బ్యాంక్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రూ.30 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల సహజ మరణ బీమా సౌకర్యాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లా తాండూర్ ఐబీలోని యూనియన్ బ్యాంక్ శాఖ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ నిశాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, యూనియన్ బ్యాంక్ మధ్య 2024 ఫిబ్రవరి 26న కుదిరిన ఒప్పందం ప్రకారం 70 సంవత్సరాల లోపు వయస్సు కలిగి యూనియన్ బ్యాంక్‌లో ఖాతాలు ఉన్న సింగరేణి విశ్రాంత కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు రూ.30 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల సహజ మరణ బీమా వర్తింపజేయాల్సి ఉందన్నారు. అయితే ఒప్పందం అమలులోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా బ్యాంక్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఒక్కరికీ కూడా బీమా సౌకర్యం కల్పించకపోవడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు.సింగరేణి సంస్థకు దశాబ్దాల పాటు సేవలందించి రిటైర్ అయిన కార్మికులు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కోసం ఈ బీమా సౌకర్యాలపై ఆధారపడుతున్నారని, అలాంటి సమయంలో ఒప్పందాన్ని అమలు చేయకపోవడం వేలాది కుటుంబాల ప్రయోజనాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. విశ్రాంత ఉద్యోగుల పట్ల యూనియన్ బ్యాంక్ యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని వెంటనే మార్చుకొని ఒప్పందంలోని అన్ని నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# ప్రజా గడపలోకి గొట్టిపాటి లక్ష్మీ

## 'ఇంటింటికి తెలుగుదేశం' ప్రచారానికి శ్రీకారం

**రెండేళ్ల కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ సమస్యలపై ఆరా**



దర్శి(ప్రశ్న న్యూస్)దర్శి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" ప్రచార కార్యక్రమానికి దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డా. గొట్టిపాటి లక్ష్మీ శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి ముందు దర్శి పట్టణంలోని మెయిన్ బజార్ శివాలయం దేవస్థానంలో భర్త, యువ నాయకుడు డా. కడియాల లలిత్ సాగర్తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పరమశివుని ఆశీస్సులు పొందారు.అనంతరం దర్శి పట్టణంలోని 19వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించిన డా. గొట్టిపాటి లక్ష్మీ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజా సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ, స్థానిక సమస్యలను స్వయంగా విని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు తమ ప్రాంత అవసరాలు, సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డా. గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు డా. కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి--సుబ్బారావు, దర్శి టౌన్ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు సత్యనారాయణ, వైస్ చైర్మన్లు గర్నిపూడి స్టివెన్, తలారి కోటయ్య, వార్డు కౌన్సిలర్లు, వార్డు టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## స్టీమ్ రైస్‌తో రేషన్‌కు కొత్త రూపు

# అక్రమ రవాణాకు చెక్

**నాణ్యమైన బియ్యంతో ప్రజలకు మేలు**

**కేంద్రంతో రాష్ట్రం కీలక చర్చలు**

**మీ మార్ట్‌లు, స్టీమ్ రైస్, ఆర్ఎఫ్ఐడీపై ముందడుగు**



అమరావతి/న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్) ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజలకు ఉపయోగకరంగా తీర్చిదిద్దే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. రేషన్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీ, బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట, నాణ్యమైన బియ్యం ప్రజలకు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహకారం కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఢిల్లీలో కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో పాటు పలువురు ఉన్నతాధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో స్టీమ్ రైస్‌ను ప్రవేశపెట్టే అంశంపై పైలట్ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్రం కోరగా, కేంద్రం సానుకూల సంకేతాలు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

### స్టీమ్ రైస్‌తో ద్వంద్వ ప్రయోజనం

ప్రస్తుతం రాష్ట్రంలోని 41 వేల ప్రభుత్వ పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా స్టీమ్ రైస్ వినియోగిస్తున్నారని, దీనిపై మంచి స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. ఇదే విధానాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ అమలు చేస్తే ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు రేషన్ బియ్యం అక్రమ రవాణా కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వివరించారు.

### 1000 'మీ మార్ట్'లకు కేంద్రం సహకారం

రాష్ట్రవ్యాప్తంగా 1000 'మీ మార్ట్'లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సహకారం కోసం నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్‌సీసీఎఫ్)తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడమే దీని ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

### ఆర్ఎఫ్ఐడీతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట

రేషన్ బియ్యం సంచులపై ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను అమర్చే ప్రతిపాదనను కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందుంచింది. దీని ద్వారా బియ్యం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందో పర్యవేక్షించడం సులభమవుతుందని, అక్రమ రవాణాను సమర్థవంతంగా నియంత్రించవచ్చని మంత్రి వివరించారు.

కేంద్ర పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజాపంపిణీ వ్యవస్థలో నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కేంద్ర సహకారం లభిస్తే, రేషన్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రహదారి అభివృద్ధి పనులలో భూనిర్వాసితులకు

# ముందుగా నష్టపరిహారం అందించాలి

## మంత్రి శ్రీధర్ బాబు

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొంపల్లి-బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్--గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు. సోమవారం కుత్బుల్లాపూర్ మండలంలోని కొంపల్లి--బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్-గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులలో భూనిర్వాసితులకు ముందుగా నష్టపరిహారం అందించాలని సైబరాబాదు కమీషనర్ సృజనకు సూచించారు. అటవీ శాఖ అనుమతులు సాధించి, ప్రజల ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్తుశాఖ వారి పనులలో భాగంగా ఎలక్ట్రిక్ పోల్ షిఫ్టింగ్ ఎంత వరకు అయ్యాయని, మిగిలినవి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు పనుల నిరంతరాయ అమలుకు వీలు కల్పించేందుకు, దూలపల్లి బహదూర్పల్లి గ్రామాలలో భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో వేగవంతం చేసి పూర్తి చేయాలని కొంపల్లి, దుండిగల్ డిప్యూటీ కమీషనర్లను ఆదేశించారు. అటవీ ప్రాంతంలో ఉన్న అన్ని విద్యుత్ స్తంభాలను ఆగస్టు 15వ లోగా తరలించే పనిని, హెచ్ఎండిఏ సహకారంతో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని టిజిఎస్పిడిసిఎల్ కు సూచించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి పూర్తయిన వెంటనే మిగిలిన రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి, సెప్టెంబర్ నెలాఖరులోగా మొత్తం రోడ్డు పని పూర్తయ్యేలా చూడాలని హెచ్ఎండిఏ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్ట్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవడం కోసం, ప్రతిపాదిత తుఫాను నీటి కాలువ యొక్క అలైన్మెంట్తో సహా వివరణాత్మక ప్రతిపాదనను సిద్ధం చేసి, వీలైనంత త్వరగా పరిశీలన నిమిత్తం సిఎంసి కమీషనర్ కు సమర్పించాలని, హెచ్ఎండిఏ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూన మాజీ ఎమ్మెల్యే కోన శ్రీశైలం గౌడ్, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్ యాదవ్, కోలన్ హనుమంత్ రెడ్డి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకెష్ కుమార్, డిసిలు , ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, హెచ్ఎండిఏ, టిజిఎస్పిడిసిఎల్, అటవీ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ పెద్ద చెరువు, తుమ్మ చెరువును పరిరక్షించాలి

## మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ ప్రజలకు జీవనాధారంగా ఉన్న పెద్ద చెరువు, తుమ్మ చెరువులను ఆక్రమణలు, మురుగునీరు, చెత్తాచెదారం నుంచి రక్షించాలని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ, చెరువుల పరిరక్షణ కోసం పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పెద్ద చెరువు, తుమ్మ చెరువుల్లోకి మురుగునీరు చేరడం, చెత్తాచెదారం పేరుకుపోవడం, శిఖం భూములు ఆక్రమణలకు గురికావడం, శిఖం ఆనుకొని అక్రమ వెంచర్లు వెలుస్తున్నా సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి చెరువులను కాపాడాలని కోరారు.వినతిపత్రంలో పెద్ద చెరువు, తుమ్మ చెరువుల్లోకి వస్తున్న మురుగునీటిని వెంటనే నిలిపివేయాలని, చెత్తాచెదారాన్ని తొలగించాలని, శిఖం భూములపై జరిగిన ఆక్రమణలను తొలగించాలని, అక్రమ వెంచర్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, చెరువుల పరిరక్షణలో విఫలమైన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని, చెరువుల హద్దులను సర్వే చేసి శాశ్వత సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త, మేడ్చల్ రూరల్ జిల్లా బీజెవైఎం అధ్యక్షులు రాగం అర్జున్, జిల్లా బీజెవైఎం నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శులు బండి విష్ణు, డీ.సాయి, సత్యనారాయణ రెడ్డి, కార్యవర్గ సభ్యులు దగ్గు రాజు, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్, చీర్ల సత్యనారాయణ, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, బొజ్జ వంశీ రెడ్డి, నాయకులు జకట బాబు రాజు, మహేష్ గౌలికర్, గోపు నాగరాజు, సదామణి నరేందర్, మామిళ్ళ నర్సింగ్, అవినాష్ చారి, రతన్ రాథోడ్, ఎన్.ఎస్.గౌడ్, సందీప్ యాదవ్, పురుషోత్తం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఒకపక్క నోటీసులు..

# మరో పక్క ఆగని అక్రమ నిర్మాణాలు

**అధికారులన్నా..నోటీసులన్నా.. జంకని అక్రమ నిర్మాణదారులు**

**సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద అక్రమంగా వెలుస్తున్న షెడ్లు**

**నోటీసులు ఇచ్చిన పట్టించుకోని అక్రమ నిర్మాణదారులు**






మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) అక్రమ నిర్మాణాలకు ఒకపక్క అధికారులు నోటీసులు ఇస్తున్నా.. మరోపక్క నిర్మాణ పనులు ఆగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులన్నా.. అధికారులు ఇచ్చే నోటీసులు అన్న.. జంకకుండా అక్రమ నిర్మాణాలు సాగిపోతున్నాయి.అధికారులు అంటే భయం లేదా నిర్లక్ష్యమా తెలియదు కానీ అక్రమ నిర్మాణాలు మాత్రం అసలు ఆగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పుట్టగొడుగుల్లా అక్రమ షెడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. సిఎంసి కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా యదేచ్ఛగా

**అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.**

**అధికారులు నోటీసులు ఇచ్చినా ... ఆగని అక్రమ నిర్మాణాలు**

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణాలకు మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇస్తున్న అక్రమ నిర్మాణ పనులు మాత్రం ఆగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇవ్వని సమయంలో నత్తనడకన సాగిన ఈ అక్రమ నిర్మాణాలు నోటీసులు ఇచ్చాక నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్ల అక్రమ నిర్మాణదారులు మరింత రెచ్చిపోతూ ఎవరికి తోచిన విధంగా వారు నిర్మాణాలు చేసుకుంటూ పోతున్నారని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. అక్రమ నిర్మాణాలు అని తెలిస్తే అధికారులు నోటీసులు ఇస్తారు. నోటీసు అందుకున్న అనంతరం వారం రోజులలో అధికారులకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అప్పటికి సమాధానం రానిపక్షంలో రెండో నోటీసు ఇస్తారు. రెండో నోటీసుకు సైతం స్పందించకపోతే మూడో నోటీసు ఇచ్చి అక్రమ కట్టడంపై చర్యలు తీసుకుంటారు. కానీ మేడ్చల్ లో మాత్రం అక్రమ కట్టడాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక నోటీసు ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్ల అక్రమ నిర్మాణదారులు మరింత రెచ్చిపోతూ అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇక్కడ అద్దెలకు భలే గిరాకీ..**

అక్కడే రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండడం, దాని పక్కనే రెవెన్యూ కార్యాలయం ఉండడంతో ఇక్కడ అద్దెలకు బలే గిరాకీ నెలకొంది. ఒక రూమ్ కు రూ. 12 వేల నుండి 15 వేల వరకు అద్దె పలుకుతుండడంతో అక్రమ షెడ్ల నిర్మాణాలు వెలుస్తున్నాయి. అయితే షెడ్ల నిర్మాణాలు చేపట్టాలంటే ముందుగా సిఎంసి కార్యాలయం నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పుట్టగొడుగుల రూములు వెలుస్తున్నాయి. ఒకపక్క వీటికి టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇస్తున్నా... నిర్మాణ పనులు మాత్రం చకచకా చేసుకుంటున్నారు.

**పేదలకు ఒక న్యాయం..**

**ఉన్నవారికి మరో న్యాయమా**

రోడ్డు పక్కన ఛాయా డబ్బాలు పెట్టుకొని చాయ్ అమ్ముకుంటూ బతికే చిరు వ్యాపారస్తుల డబ్బాలను తొలగించే టౌన్ ప్లానింగ్ అధికారులు... ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న బడా బాబుల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ సిఎంసి పరిధిలో ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా రోడ్డుకు ఇరువైపుల డబ్బాలు, నాలుగు చక్రాల బండ్లు పెట్టుకొని చిన్నాచితక వ్యాపారాలు చేసుకుంటూ బతికే చిరు వ్యాపారస్తుల డబ్బాలనుతొలగించే అధికారులు ఇలాఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే బడా బాబుల జోలికి టౌన్ ప్లానింగ్ అధికారులు వెళ్లడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా టౌన్ ప్లానింగ్ అధికారులు, పేదవారు దళితులు అన్న భేదం లేకుండా అక్రమ కట్టడాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్నికలు లేకున్నా ప్రజల గడపలోకి కూటమి

- 'చేసిన మంచి చెప్పడమే మా బాధ్యత'
- 49వ డివిజన్‌లో 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం
- సంక్షేమ విజయాలు' కార్యక్రమానికి శ్రీకారం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, జూలై 27(ప్రశ్న న్యూస్)** ఎన్నికలు లేకపోయినా ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడం తమ బాధ్యత అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 49వ డివిజన్ వేళాంగిణి నగర్ నుంచి ఆమె ప్రారంభించారు.వేళాంగిణి నగర్ ఆర్చి వద్ద ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పూర్తయిన పనుల వివరాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం చేసిన మంచిని చేరవేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా ప్రజలకు మరింత మేలు చేసే కార్యక్రమాలను కూడా చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్‌రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్ యాదవ్, తెలగతోటి సుధీర్, మద్దిరాల మ్యానీ, నిమ్మల శేషయ్య, కతారి అశోక్, మేళం సైద్ధయ్య, జొన్నలగడ్డ ఉదయ్ భాను, బెజ్జం అనిల్, మార్కో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంథని బీసీ బాలికల ఎస్ ఎం హెచ్ హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి.

**- ఆర్ల సందీప్ ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు.**




**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండల కమిటి ఆధ్వర్యంలో హాస్టల్ ను సందర్శించడం జరిగింది. సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు హాస్టల్ లోని సమస్యలు తెలుసుకుందామని వెళితే హాస్టల్ కి తాళం వేసి మూసి ఉన్నది మంథనిలో వరుసగా హాస్టల్లో మూతపడడానికి కారణం హాస్టల్ వార్డెన్ లు జిల్లా అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందని అన్నారు ప్రభుత్వం నుండి వేతనాలు తీసుకుంటూ విధులు సక్రమంగా నిర్వహించకుండా హాస్టల్ లు మూతపడడానికి అధికారులు కారణమవుతున్నారు అధికారుల నిర్లక్ష్యం మూలంగానే మంథని లో విద్యావ్యవస్థ కుంటుపడుతుందని అన్నారు మంథనిలో కాలేజీలు పాఠశాలలు నడుస్తున్న క్రమంలో హాస్టల్ లు మూతపడి ఉండడం ఏంటని మండిపడ్డారు అడ్మిషన్లు అవుతున్న క్రమంలో హాస్టల్ లు తలుపులు వేసి తాళాలు ఉంటే మరి అడ్మిషన్లు ఏ విధంగా జరుగుతాయని అధికారులను ప్రశ్నించారు అదేవిధంగా మంథని లోని ఎస్సీ బాలికల హాస్టల్ కూడా అదే పరిస్థితిలో తలుపులకు తాళాలు వేసి కొనసాగుతుంది అన్నారు ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నియోజకవర్గ కేంద్రంలోనే హాస్టల్ కాలేజీల పరిస్థితి ఇలా కొనసాగడం విచారకరమని అన్నారు మంత్రి వెంటనే స్పందించి మంథని నియోజకవర్గ లో ఉన్న హాస్టల్ లు సాంఘిక సంక్షేమ హాస్టల్ గురుకుల పాఠశాలలుచేస్తున్నట్లు ప్రభుత్వ కాలేజీలు ప్రభుత్వ పాఠశాలలో సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్ కుమార్,అఖిల్,మహేందర్, కిరణ్,చరణ్ పాల్గొన్నారు.

## బాలికను వేధించిన కేసులో నిందితుడికి ఏడాది జైలు.

# రూ.20 వేల జరిమానా

- లవ్ లెటర్ రాసి.. బెదిరింపులకు పాల్పడిన యువకుడికి జైలు శిక్ష
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానంటూ లేఖ రాసి వేధించిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.చాకలి కుమార్ (21) టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని చెబుతూ లవ్ లెటర్ రాశాడు. ఆ లేఖను బాలికకు ఇవ్వాలని తన స్నేహితుడు మహేష్‌కు ఇచ్చాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలపగా, వారు గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పెద్దలు కుమార్‌ను పిలిపించి ప్రశ్నించగా, లేఖ తానే రాసినట్లు అంగీకరించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న కుమార్ 19-02-2023న సాయంత్రం 5 గంటల సమయంలో గ్రామ పెద్దల దృష్టికి విషయం తీసుకెళ్లినందుకు బాలిక తల్లిదండ్రులను బూతు మాటలతో దూషిస్తూ, వారిని చంపి జైలుకు వెళ్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు శివంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ, కేసు దర్యాప్తు అధికారి రవికాంత్‌రావు కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టులో వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు కుమార్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ ఆనంద్, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేతా సహకరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

# పిఠాపురంపై పవన్ ప్రత్యేక దృష్టి

**రోడ్లు.. తాగునీరు.. పాఠశాలలు.. ఆసుపత్రులు.. పారిశుధ్యంపై సమగ్ర సమీక్ష**

**100 భజన మందిరాల నిర్మాణానికి ప్రణాళికలు.. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యత పరిశీలనకు ఆదేశాలు**



అమరావతి(ప్రశ్న న్యూస్) పిఠాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభివృద్ధి పనులపై మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించారు. రహదారులు, తాగునీటి పథకాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, పారిశుధ్యం, దేవాదాయ శాఖ అభివృద్ధి పనులతో పాటు వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించేందుకు తన కార్యాలయ సిబ్బందిని నియోజకవర్గానికి పంపి, వారు సమర్పించిన నివేదికల ఆధారంగా శాఖల వారీగా సమీక్షించారు.

### 288 సిమెంట్ రోడ్లు... నాణ్యతే ప్రాధాన్యం

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 288 సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు వివరించారు. అయితే పనులు పూర్తయ్యాయనే నివేదికలతో సరిపెట్టకుండా, క్షేత్రస్థాయిలో రోడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించాలని పవన్ కళ్యాణ్ తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మించిన ప్రహరీ గోడల పనులను కూడా తనిఖీ చేయాలని సూచించారు.

### నాగులాపల్లి తాగునీటి పథకం ప్రారంభానికి సిద్ధం

యూ.కొత్తపల్లి మండలంలోని నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకం విస్తరణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. 52 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఈ పథకాన్ని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు, ఫిల్టర్ బెడ్లు తదితర నిర్మాణాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.

### పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక పర్యవేక్షణ

నియోజకవర్గంలోని 191 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 18 వేల మంది విద్యార్థులు చదువుతున్న నేపథ్యంలో, శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందేలా ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

### పారిశుధ్యం, ఆసుపత్రులపై ఆరా

పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ పనులను సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి, ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే సహించబోమని హెచ్చరించారు. గత పర్యటనలో పరిశీలించిన ఇందిరానగర్ డ్రెయిన్ అభివృద్ధి పనుల పురోగతిని కూడా అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై కూడా సమీక్ష నిర్వహించారు.

### 100 భజన మందిరాలకు కార్యాచరణ

ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరొందిన పిఠాపురంలో టీటీడీ సహకారంతో 100 భజన మందిరాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. స్థల సేకరణ, ఆలయ కమిటీల ఏర్పాటు, నిర్మాణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### రైతులకు సాగునీటి కార్యాచరణ

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా రైతులకు ముందుగానే నీటి విడుదల క్యాలెండర్ అందించాలని, వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ఆదర్శ నియోజకవర్గమే లక్ష్యం

పిఠాపురం ప్రజల అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు, విద్య, వైద్యం, ఆధ్యాత్మిక అభివృద్ధి, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించి పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## గుంటూరులో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన

# న్యూ జనరేషన్ మారుతి బ్రేజా

**టర్బో జెట్ ఇంజన్ - స్మార్ట్ హైబ్రిడ్ టెక్నాలజీతో కస్టమర్ల ముందుకు అత్యాధునిక ఎస్‌యూవీ**







గుంటూరు (ప్రశ్న న్యూస్) దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మారుతి సుజుకి బ్రేజా ఇప్పుడు మరింత ఆధునిక సాంకేతికతతో, అత్యాధునిక భద్రతా ఫీచర్లతో, ఆకర్షణీయమైన డిజైన్‌తో వినియోగదారుల ముందుకు వచ్చింది. గుంటూరులోని మిర్చి యార్డు రోడ్డులో ఉన్న వరుణ్ మోటార్స్ షోరూమ్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు నూతన తరం మారుతి బ్రేజా గ్రాండ్ లాంచింగ్ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆటోమొబైల్ రంగంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికేలా జరిగిన ఈ కార్యక్రమం కొనుగోలుదారులు, కార్ల ప్రేమికులు, ప్రముఖుల సమక్షంలో ఘనంగా సాగింది.ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, జనసేన పార్టీ గుంటూరు పట్టణ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై నూతన బ్రేజా కారును ఆవిష్కరించారు. పట్టణ ప్రముఖులు విశ్వనాథ్, పలువురు కస్టమర్లు, ఆటోమొబైల్ రంగ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని కొత్త మోడల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. వరుణ్ మోటార్స్ మేనేజర్ రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మారుతి సుజుకి టీఎస్‌ఎం కార్తికేయ శర్మ, వరుణ్ మోటార్స్ సీఈఓ గిరిబాబు పాల్గొని కొత్త బ్రేజా ప్రత్యేకతలను వివరించారు. అత్యాధునిక ఇంజన్ సాంకేతికత, భద్రతా ప్రమాణాలు, ఇంధన పొదుపు, ప్రయాణ సౌకర్యాల పరంగా ఈ కారు వినియోగదారుల అంచనాలను మించేలా రూపొందించబడిందని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, 2016లో భారత మార్కెట్‌లో అడుగుపెట్టిన మారుతి బ్రేజా లక్షలాది కుటుంబాల విశ్వాసాన్ని సంపాదించుకున్న ప్రజల కారు అని పేర్కొన్నారు. భారతీయ రోడ్ల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ నూతన మోడల్‌లో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. భద్రత, నాణ్యత, మైలేజ్, సౌకర్యం అన్నింటికీ ప్రాధాన్యం ఇచ్చిన ఈ కారు మధ్యతరగతి కుటుంబాలకు మరింత చేరువవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

మారుతి సుజుకి ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ కొత్త బ్రేజా 1.0 లీటర్ టర్బో జెట్ ఇంజన్తో పాటు 1.5 లీటర్ స్మార్ట్ హైబ్రిడ్ టెక్నాలజీ వేరియంట్లలో అందుబాటులోకి వచ్చిందన్నారు. స్మార్ట్ హైబ్రిడ్ వ్యవస్థ వల్ల ఇంధన వినియోగం తగ్గి, మెరుగైన మైలేజ్‌తో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. అలాగే అండర్‌బాడీ సీఎన్‌జీ అమరికతో డిక్కీలో అదనపు లగేజీ స్థలం లభించడం ఈ మోడల్‌కు మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందన్నారు.వరుణ్ మోటార్స్ సీఈఓ గిరిబాబు మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక ఫీచర్లు, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, ఆకర్షణీయమైన ఇంటీరియర్, సౌకర్యవంతమైన డ్రైవింగ్ అనుభవంతో ఈ బ్రేజాను అందిస్తున్నామని చెప్పారు. సుమారు రూ.14 లక్షల పరిధిలోనే ఈ మోడల్ అందుబాటులో ఉండడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు ఇది అత్యుత్తమ ఎంపికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే బ్రేజా దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందగా, ఈ కొత్త మోడల్ మరింత విజయాన్ని సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.జనసేన పార్టీ గుంటూరు పట్టణ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2016 నుంచి భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో బ్రేజా విశేష ఆదరణ పొందిందన్నారు. ఇప్పుడు స్మార్ట్ హైబ్రిడ్ టెక్నాలజీ, ఆధునిక డిజైన్, మెరుగైన భద్రతా ఫీచర్లతో కొత్త తరం బ్రేజా రావడం సంతోషకరమైన విషయమన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ధరలో ఇలాంటి సాంకేతికతను అందించడం మారుతి సుజుకి సంస్థ ప్రత్యేకత అని కొనియాడారు. ఈ గ్రాండ్ లాంచింగ్ కార్యక్రమం ద్వారా ఆటోమొబైల్ ప్రేమికుల్లో కొత్త బ్రేజాపై మరింత ఆసక్తి నెలకొనగా, రానున్న రోజుల్లో ఈ మోడల్ విక్రయాల్లో కొత్త రికార్డులు సృష్టించే అవకాశాలు ఉన్నాయని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అర్జీల పరిష్కారంలో గుంటూరు ఆదర్శంగా నిలవాలి

**ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు, గడువులోగా పరిష్కరించండి**

**అధికారులకు ఆదేశాలు జారీ చేసిన**

**- జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ**




గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల పరిష్కారంలో గుంటూరు జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, పెండింగ్‌కు తావివ్వొద్దని స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి వివిధ శాఖల అధికారులతో అర్జీల పరిష్కార తీరుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంపై ఆశతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలను ఆశ్రయిస్తారని, అలాంటి అర్జీలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఏవైనా కారణాలతో సమస్యను పరిష్కరించడం సాధ్యం కాకపోతే, ఆ విషయాన్ని స్పష్టమైన కారణాలతో అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు.

### అర్జీదారులకు మెరుగైన సౌకర్యాలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యం, మండే ఎండల నుంచి ఉపశమనం కలిగించేలా మజ్జిగ పంపిణీ, భోజన వసతి, వైద్య శిబిరం వంటి ఏర్పాట్లపై అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు, పశుసంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్‌టీఓ శ్రీహరిరావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 'నా తాన్ కేస్ కొడు' మూవీ రివ్యూ!



కుంచాకో బోబన్ కి మలయాళంలో మంచి క్రేజ్ ఉంది. కథాబలం .. పాత్రలలో వైవిధ్యం ఆయన సినిమాలలో ప్రధానంగా కనిపిస్తూ ఉంటాయి. ఓటీటీ సినిమాల కారణంగా ఇతర భాషలలోను ఆయనను అభిమానించేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆయన ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'నా తాన్ కేస్ కొడు'. 2022లో విడుదలైన ఈ సినిమా, 'జియో హాట్ స్టార్' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 24వ తేదీ నుంచి తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. రాజీవ్ (కుంచాకో బోబన్) చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ జీవిస్తుంటాడు. ఒకసారి పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో అతను 'దేవి' (గాయత్రి శంకర్)కి దగ్గరవుతాడు. దొంగతనాలు మానేసి ఆమెతో కొత్త జీవితాన్ని మొదలుపెడతాడు. అతని కారణంగా ఆమె గర్భవతి అవుతుంది. ఒకరోజు రాత్రి అతను ఎమ్మెల్యే ఇంటి ప్రహరీ గోడ దూకుతాడు. దాంతో అతణ్ణి కుక్కలు తీవ్రంగా గాయపరుస్తాయి. తమ ఇంట్లోని ముఖ్యమైన ఫైల్స్ .. డబ్బు కనిపించకుండా పోయాయని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కోర్టుకు వెళతారు. గుడికెళ్లి ఎమ్మెల్యే ఇంటిముందు నుంచి తిరిగొస్తుండగా, తనపైకి ఆటో దూసుకొస్తుండటం చూసి .. భయంతో ప్రహరీ గోడ దూకేశానని కోర్టులో రాజీవ్ చెబుతాడు. దాంతో ఆటో డ్రైవర్ సురేశ్ ను కోర్టుకు తీసుకొస్తారు. తన ఆటోను వెనుక నుంచి పాల వ్యాన్ ఢీ కొట్టడం వలన, తన ఆటో ముందుకు దూసుకుపోయిందని అతను కోర్టుకు చెబుతాడు. వెంటనే పాల వ్యాన్ డ్రైవర్ ను కోర్టులో ప్రవేశ పెడతారు. రోడ్డుపై గుంతలు ఉండటం వలన, ఒక వ్యక్తిని తప్పించబోయి ఆటోను ఢీకొట్టినట్టు అతను ఒప్పుకుంటాడు. జరిగిన సంఘటనకు కారణం రోడ్లపై గుంతలు ఉండటమేననీ, ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నందుకు సదరు మంత్రిని కోర్టులో ప్రవేశ పెట్టవలసిందేనని రాజీవ్ పట్టుబడతాడు. ఒక మంత్రిని కోర్టుకు రప్పించవలసిందేనని ఒక సామాన్యుడు కోరడంతో, రాష్ట్రంలోని అందరి దృష్టి ఈ కేసు వైపుకు మళ్లుతుంది. ఆ తరువాత ఈ కేసు ఎలాంటి మలుపు తిరుగుతుంది? రాజీవ్ ప్రయత్నం ఫలిస్తుందా లేదా? అనేది మిగతా కథ. ఇది ఒక చిన్న దొంగ కథ .. చిల్లర దొంగ కథ. దొంగతనాలు మానేసిన తరువాత, ఆ నేరంపై స్టేషన్ కి వెళ్లిన రాజీవ్ అనే యువకుడి కథ. ఎమ్మెల్యే ఇంట్లో దొంగతనానికి పాల్పడిన కారణంపై స్టేషన్ కి వెళ్లిన రాజీవ్, దొంగతనం చేయాలనే ఉద్దేశం తనకిలేదని చెబుతాడు. కానీ తమ ఇంట్లో వస్తువులు పోయాయని ఎమ్మెల్యే ఫ్యామిలీ తేల్చి చెబుతుంది. తాను నిర్దోషినని నిరూపించుకోవడం కోసం ఒక సామాన్యుడు చేసిన పోరాటం, ఒక మంత్రిని ఎలా కోర్టుకు రప్పిస్తుంది? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. చిన్న చిన్న నేరాలు చేసిన సామాన్యులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ .. కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉంటారు. తమ దగ్గర డబ్బులేకపోయినా .. పనులు మానుకుని మరీ వాయిదాలకు హాజరవుతూ ఉంటారు. అయితే అధికారంలో ఉన్న కొంతమంది పెద్దలు తమ నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్న నేరాలకు .. ప్రమాదాలకు ఎంతమాత్రం బాధ్యత వహించకుండా కూల్ గా బ్రతికేస్తుంటారు. అలాంటివారికి ఒక సామాన్యుడు చేసే హెచ్చరికనే ఈ కథగా చెప్పుకోవాలి. ఈ కథ ఒక 30 శాతం అవుట్ డోర్ లో నడిస్తే, మిగతా కథ కోర్టు రూమ్ లో కొనసాగుతుంది. సాధారణంగా మలయాళ కథలు చాలా సాదాసీదాగా మొదలవుతాయి. ఆ తరువాత కథ చిక్కబడుతూ వెళుతుంది. ఈ కథ కూడా చివర్లో ఏదో ట్విస్ట్ ఇస్తుందనే ఆడియన్స్ ఎదురుచూస్తారు. కానీ ఆ స్థాయి ట్విస్ట్ ఏదీ పలకరించదు. కోర్టు రూమ్ లో కథ అక్కడక్కడే తిరుగుతూ ఉంటుంది. వాదోపవాదాలు చాలా నీరసంగా కొనసాగుతూ నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. ఒక సాధారణ యువకుడు .. ఒక మంత్రిగారిని కోర్టుకు రప్పించడమనే ఒక పాయింట్ ఆసక్తిని రేకెత్తించేదే. అయితే ఆ దిశగా అల్లుకుంటూ వెళ్లిన సన్నివేశాలు అంతగా ఇంపాక్ట్ చూపించలేకపోయాయి. ఇక హీరో – హీరోయిన్ మధ్య లవ్ .. రొమాన్స్ కి ఛాన్స్ ఉన్నా, ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. కోర్టు రూమ్ కామెడీ కూడా ఆశించిన స్థాయిలో వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా ప్రేక్షకుడిపై పెద్దగా ప్రభావం చూపలేకపోవడానికి ప్రధానమైన కారణం, ఎమోషన్ ను కనెక్ట్ చేయలేకపోవడమేనని చెప్పుకోవాలి.

ఆర్టిస్టులంతా చాలా సహజంగా చేశారు. కెమెరా పనితనం .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ కూడా ఫరవాలేదు. ఎటొచ్చి కథాకథనాలలోనే సరిపడినంత బలం లేదు. మలయాళంలో ఈ సినిమాకి మంచి రెస్పాన్సే వచ్చింది. 50 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. తెలుగు ఆడియన్స్ వైపు నుంచి చూసుకుంటే మాత్రం, చాలా నిదానంగా సాగిన కంటెంట్ గానే నిలిచిపోతుంది. కానీ మలయాళ సినిమాలలో కనిపించే సహజత్వం మాత్రం, ఎప్పటిలానే మార్కులు కొట్టేస్తుంది.

# 'రాకా'లో అల్లు అర్జున్ వైల్డ్ ఎంట్రీ

## భారీ యాక్షన్ ఎపిసోడ్‌తో కొత్త షెడ్యూల్‌కు సిద్ధమైన అట్లీ!



రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఇప్పుడు కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది.

ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ స్టార్‌డమ్, అట్లీ మాస్ టేకింగ్, భారీ తారాగణం, గ్రాండ్ యాక్షన్ సీక్వెన్స్‌లు కలిసి 'రాకా'ను ఇండియన్ సినిమా చరిత్రలో మరో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా నిలబెట్టేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# ప్రతి పాత్ర సహజంగా ఉంటుంది



పెద్ద స్టార్ అవుతారని, మోహన్‌బాబు, నరేశ్ పోషించిన పాత్రలు సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని దర్శకుడు అజయ్ భూపతి నమ్మకంగా చెప్పారు. ఇంకా నరేశ్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ వడ్లమాని, డీవోపీ జైకృష్ణ కూడా మాట్లాడారు. 'నేను, అల్లు అర్జున్, రామ్‌చరణ్ వైజయంతీ సంస్థ ద్వారానే హీరోలుగా పరిచయం అయ్యాం. అలాంటి గొప్ప సంస్థ ద్వారా మా జయకృష్ణ కూడా వెండితెరకు పరిచయం కావడం సంతోషంగా ఉంది. ఈ సినిమా కోసం మా కుటుంబమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నది.

ట్రైలర్, పాటలు బావున్నాయి. ముఖ్యంగా 'అలెల్లే అలెల్లే..' సాంగ్ నాకు బాగా నచ్చింది.

'ప్రేక్షకుల్ని వందశాతం మెప్పించే సినిమా ఇది. ఇందులోని ప్రతి పాత్రనూ రియలిస్టిక్‌గా రాశారు దర్శకుడు అజయ్‌భూపతి. ఓ మంచి కథ ద్వారా పరిచయం అవుతున్నందుకు సంతోషంగా ఉంది.' అని సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, చిత్ర కథానాయకుడు జయకృష్ణ ఆనందం వెలిబుచ్చారు. ఆయన కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'శ్రీనివాసమంగాపురం'. రషా తడానీ కథానాయిక. ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్ సమర్పణలో పి.కిరణ్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా రిలీజ్ ప్రెస్‌మీట్‌లో హీరో జయకృష్ణ మాట్లాడారు. తెలుగులో ఈ తరహా మేకింగ్ సినిమాలు రావడం అరుదు అని, మహేశ్‌బాబులా జయకృష్ణ కూడా నటీనటుల్ని దర్శకుడు అజయ్‌భూపతి చాలా బాగా చూపించారు. తెరకు పరిచయం అవుతున్న జయకృష్ణ, రషా తడానీలకు అభిమానులు ప్రోత్సాహం అందించాలని, ఆశీర్వదించాలని కోరుకుంటున్నా' అంటూ 'శ్రీనివాస మంగాపురం' టీమ్‌కి అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు తన ఎక్స్ ద్వారా 'ఆల్ ది బెస్ట్' అని చెప్పారు.



# ప్రశాంతమైన రక్తపాతం

'కేజీఎఫ్' ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్'. ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా మరో కొత్త పోస్టర్‌ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. ప్రశాంతంగా సిగరెట్ వెలిగిస్తున్న యశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. యశ్ చేతులు చిక్కటి రక్తంతో తడిసి ఉండటం, వేళ్ల నుంచి రక్తపు చుక్కలు జారుతూ కనిపించడం చూస్తే, ఇదొక టెర్రిఫిక్ యాక్షన్ సీన్‌కి సంబంధించిన స్టిల్ అని అర్థమవుతున్నది. ఫియర్, మిస్టరీ, హైస్టైల్ మేళవింపైన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతుందని మేకర్స్ చెబుతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాస్టర్ మైండ్ క్రియేషన్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## నాకు ఎవరేం పని చేసినా

# నచ్చదంటున్న వెంకీ

### ఆదర్శ కుటుంబం హౌస్ నెం.ఃఖ47 నుంచి చిట్టిబాబు గ్లింప్స్



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం'. వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు.

అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది.

ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

## మాట నిలబెట్టుకున్న బోయిన్ పేట్ కౌన్సిలర్

**- "పోతరవేని శ్రీలత క్రాంతి"**

**- రెండు నెలల వేతనంతో పేద కుటుంబాలకు అండగా...**



**మంథని (ప్రశ్న న్యూస్)** ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మంథని పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ తమకు వచ్చిన రెండు నెలల కౌన్సిలర్ వేతనాన్ని బోయిన్‌పేట అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగించారు. ఈ సందర్భంగా బోయిన్‌పేటకు చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత మరచిపోయే నాయకులు ఉన్న ఈ రోజుల్లో, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధి బాధ్యత అనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీల మద్దతు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి, ప్రజల ఆశీర్వాదంతో జిల్లా లోనే భారీ మెజారిటీతో గెలిచిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల కౌన్సిలర్ వేతనాన్ని ప్రజలకే వినియోగిస్తానని ప్రకటించగా, అందులో భాగంగా రెండు నెలల వేతనంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బియ్యం, కిరాణా సరుకులు, నిత్యావసర వస్తువులను అందజేసి వారికి అండగా నిలిచారు. ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్వంత డబ్బులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలవడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు..ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయబోనని, బోయిన్‌పేట అభివృద్ధి, వార్డు ప్రజల సంక్షేమం, పేదల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు..నీతి, నిజాయితీ, నిస్వార్థంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రజల సహకారం, విశ్వాసంతోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి బోయిన్‌పేటను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం..
## సెంట్రల్‌లో శ్రీకారం :బొండా ఉమ

**- 'సూపర్ సిక్స్' అమలుతో ప్రజల్లో విశ్వాసం పెరిగింది**

**- 550 కోట్ల అభివృద్ధి పనులతో నియోజకవర్గానికి కొత్త రూపు: ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించేందుకు తెలుగుదేశం పార్టీ చేపట్టిన "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" ఇంటింటి ప్రచార కార్యక్రమానికి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. గుణదల 1వ డివిజన్ గాంధీజీ కాలనీలోని వినాయకుడి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారి పాదాల వద్ద ప్రచార కరపత్రాన్ని ఉంచి ఆశీర్వాదం తీసుకున్న బొండా ఉమ, అనంతరం కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రతి గడపకు చేరవేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే సామాజిక పెన్షన్‌ను ?3,000 నుంచి ?4,000కు పెంచామని గుర్తు చేశారు. ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాని మృతి తీవ్ర విషాదంలో నెట్టివేసింది

**- నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి**



**విజయవాడ** పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసిందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.. రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆ రోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవ్వడం నన్ను కలిచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవ్వరూ ఒత్తిడికి, నిరాశ, నిస్పృహలకులోను కావొద్దని కోరుతున్నాను. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధను, ఆవేదనను మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని, అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని తెలియజేస్తున్నామని అన్నారు..

## శ్వాసకోశ సమస్యలకు మూలం పావురాల దుర్గంధం

- ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన పావురాలు - ఎస్ ఆర్ నగర్ ప్రధాన రహదారిపై భారీగా పెరిగిన పావురాలు
- పావురాల వల్ల రోడ్లపై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- మెట్రో రైల్ పైలట్ లకు తీవ్ర అసౌకర్యంగా మారిన పావురాలు
- ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతుడడంతో శ్వాసకోశ సమస్యలతో ప్రజల పాట్లు
- సోయి లేని సంబంధిత అధికారులు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆనందం కోసం, విశ్వాసాలను అనుసరించి పావురాలను పెంచడం, వాటికి ఆహారం అందించడం అనాదిగా వస్తున్న సంప్రదాయంగా మారింది. గతంతో పోల్చుకుంటే నగరాలు, పట్టణాల్లో పావురాల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే పావురాలు ఉన్నచోట మనుషులకు అనారోగ్య సమస్యలు వస్తు ప్రాణాంతకంగా మారుతుండడం, వీటితో పోటీ పడలేక వివిధ పక్షి జాతులు కనుమరుగవుతుండడం గమనార్హం. దీంతో ప్రభుత్వం పావురాల పెరుగుదలను నియంత్రించే చర్యలు చేపట్టడం హర్షణీయం. అయితే క్షేత్రస్థాయిలో ఈ చర్యలు ఎంతవరకు సత్ఫలితాలు ఇస్తున్నాయనేది మాత్రం రహస్యంగా మిగిలి పోయిన ప్రశ్న.

### పావురాలతో ముప్పు

హైదరాబాద్ మహానగరంలో పావురాల వల్ల ఆయా పరిసరాల్లో నివసించే ప్రజలకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తి, అలెర్జీలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న కబూతర్ ఖానాలను (పావురాలకు దాణా వేసే ప్రాంతం) మూసివేశారు. ఇక పావురాలకు వేసున్న దాణా కుళ్లిపోవడం, పావురాల రెట్టతో దుర్గంధం వెదజల్లడంతో పాటు వాటి శరీరంపై ఉండే సూక్ష్మజీవులు మనిషి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో పావురాల వల్ల అపరిశుభ్రత పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దేశంలో చాలావరకు హైపర్ సెన్సిటివిటీ న్యుమోనైటిస్ కేసులకు పావురాలే కారణమని, పావురాల రెట్టలు, ఈకల నుంచి క్రిప్టోకోకస్, హిస్టో ప్లాస్మోసిస్ లాంటి శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, వైరస్, ప్రొటీన్లు విడుదలవడంతో వీటిని పీల్చడం వల్ల వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వృద్ధులు, పిల్లల్లో అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు, మెదడువాపు తదితర వ్యాధులు ప్రబలుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### గణనీయంగా పెరుగుతున్న పావురాలు

నగరంలో రోజురోజుకు పావురాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. భవనాలు, ఆకాశహర్మ్యాలు తదితర ఎత్తైన భారీ నిర్మాణాల్లో పావురాలు గూళ్లు పెట్టుకోవడానికి అనుకూలమైన ప్రదేశాలు. వీటికి సులభంగా దాణా అందుతుండడంతో అటవీ, గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే అర్బన్?లో వీటి సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. పట్టణాల్లో ఉండే పావురాలు ఏటా ఆరుసార్లు సంతానాన్ని కంటాయి. వీటిని వేటాడే జంతువులు, పక్షులు చాలా తక్కువగా ఉండడంతో నియంత్రణ సహజంగా జరగడం లేదని, దీంతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి.

### పావురాలతో సోకే వ్యాధులు

పావురం రెట్టతో 60 రకాల వ్యాధులకు కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటి విసర్జకాలు అంటువ్యాధుల్ని కలగజేసే క్రిములకు వాహకాలుగా పనిచేస్తాయి. వీటి ఈకల్లో ఉండే టిక్స్, మైట్స్, పేలు వంటి సూక్ష్మజీవులు హానిచేస్తాయి. ఒక పావురం ఎగిరినప్పుడు దాని రెక్కలను విప్పడంతో గాలిలో తేలియడే ప్రొటీన్లను విడుదల చేస్తుంది. ఈ ప్రోటీన్లు చాలా రోజుల వరకు గాలిలో ఉంటాయి. మనం గాలితో పాటు వీటిని పీల్చినప్పుడు నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస కోశ సంబంధిత వ్యాధులకు దారితీస్తుంది. అలాగే వీటి ఈకల మీద 'డాండర్' (చుండ్రును పోలిన) అనే పదార్థం ఉంటుంది. ఇవి ఎగిరినప్పుడు గాలిలోకి చేరి, అక్కడున్న వారికి ఎలర్జీలకు కారణమవుతుంది. ఆయాసం, దగ్గు, ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు వారి పరిసర ప్రాంతాలలో పావురాలు మరింత ప్రమాదకరం.

### పావురాల నియంత్రణ

పక్షులకు సొంతంగా ఆహారం సమకూర్చుకునే లక్షణం ఉంటుంది. కానీ దాన్ని మనమే తగ్గిస్తున్నామని పరిశోధకులు అంటున్నారు. పావురాలకు ఆహారం వేయడం మానేస్తే, అవి జనావాసాల నుంచి దూరంగా వెళతాయని అలాగే, ఇళ్లలోకి రాకుండా తలుపులు, కిటికీలకు నెట్?లు, అపార్టుమెంట్లకు వలలు వేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లలో పావురాలు రెట్ట వేస్తే కిటికీలు, పైకప్పుల్ని మాస్క్? ధరించి ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోని అక్కడ క్రిమి సంహారకాలను చల్లాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇళ్లపైన ఉండే వాటర్ ట్యాంకులకు కచ్చితంగా మూతలు పెట్టాలని, అంతేకాకుండా, కబూతర్ ఖానాలను జన సమర్థం ఉండే ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలని చెబుతున్నారు.

### ఎస్ ఆర్ నగర్ ప్రధాన రహదారిపై కబూతర్ ఖానా

నగరంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో ముఖ్యమైన ఎస్ అర్ నగర్ ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా పావురాల ధాన షాపును నిర్వహిస్తు పరోక్షంగా పావురాల సంఖ్యను భారీగా పెంచేస్తున్నారు. ఎస్ ఆర్ నగర్ ప్రధాన రహదారిపై ఉన్న మక్బరా ప్రాంతంలో విచ్చలవిడిగా పావురాలకు ధానా వేస్తుండడంతో రోడ్డు పై వేలకొద్ది పావురాలు గుమిగూడి ఉండడంతో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అలాగే ప్రతిరోజు వాహనాల కింద పడి పదుల సంఖ్యలో పావురాలు మృత్యువాత పడుతున్నాయి. ఇదిలావుండగా ఈ ప్రాంతమంతా దుర్గంధభరితమై ఉండడంతో స్థానికులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ప్రతిరోజు 2-3 క్వింటాళ్ల ధానాను విక్రయిస్తున్నారంటే ఇక్కడి పరిస్థితిని అంచన వేయవచ్చు. ముఖ్యంగా చాతి సంబంధిత వ్యాధులకు చికిత్సలు అందించే ఆసుపత్రి ముందే శ్వాసకోశ వ్యాధులకు మూలకారణమయే పావురాలకు అక్రమంగా ధానవేసి పెంచి పోషిస్తున్న దళారులపై జీఎచ్ఏంసి అధికారులు కాని, పోలీసుల సిబ్బంది గానీ ఎందుకు స్పందించడం లేదో అర్థం కాని విషయం. పావురాలకు నాన్ వేయడాన్ని నిషేధించినప్పటికి ఏకంగా ప్రధాన రహదారిపై అక్రమ వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయితే పావురాలు రోడ్లపై వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలిగించడమే కాక మెట్రో రైల్ కు సంబంధించిన విద్యుత్ వైర్లపై వాలడంతో మెట్రో రైలు పైలెట్లకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పావురాలను ఇక్కడి నుండి ఖాళీ చేయించే చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

### కోర్టు ఆదేశాలు బేఖాతరు

పావురాల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పావురాలకు దాన వేయడం వంటి చర్యలపై నిషేధించాలని కోర్టులు కఠినంగా హెచ్చరిస్తున్నాను అధికారులకు సోయిలేదు. నగరం రోజు రోజుకూ రెట్టింపవుతున్న పావురాల సంతతిని కట్టడి చేస్తు పూర్తిస్థాయిలో నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

## పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

**- ఓబీసీ జాతీయ సదస్సు డిమాండ్**





**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** చట్టసభల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు, దామాషా ప్రాతినిధ్యాన్ని కూడా నిర్ధారించేందుకు బీసీ బిల్లును పార్లమెంటులో తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తు సోమవారం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీల) డిమాండ్లపై ఒక జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల ఎంపి లు జాతీయ బీసీ నాయకులు, మేధావులు, పాల్గొన్న ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, నూకాలమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్యంగా ఈ సెమినార్ లో చట్టసభలలో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు దామాషా ప్రాతినిధ్యాన్ని కూడా నిర్ధారించేందుకు బీసీ బిల్లును పార్లమెంటులో తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్ తర పాటు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సెమినార్ లో ఎం.పి లు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, నాగరాజు (కర్ణాటక) పాక సత్యనారాయణ, లక్ష్మినారాయణ, రామారావు (మహరాష్ట్రా) పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతు భారతీయ జనతా పార్టీ ఒక బీసీ నాయకున్ని ప్రధానమంత్రిగా చేసిందని చెప్పారు. అలాగే కేంద్రంలో 27 బీసీ నాయకులకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించారని గుర్తు చేశారు. దేశాభివృద్ధి బీసీ వర్గాల పురోగతిపై ఆధారపడి ఉందని, మోదీ హయంలోనే బీసీ బిల్లు వాస్తవ రూపం దాల్చవచ్చనే ఆశాభావం వ్యక్తం చేశారు. వెంటనే పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని, రాజ్యాంగ సవరణ ద్వారా చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, బీసీ ఉద్యోగులకు పదోన్నతులల్లో రిజర్వేషన్లు, కుల గణన, విద్య, ఉపాధి, రాజకీయాల్లో దామాషా రిజర్వేషన్లు, బీసీలకు రక్షణ చట్టం, హాస్టళ్లను పెంచడం, స్కాలర్ షిప్పులు, న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు, రిజర్వేషన్లలో క్రిమీలేయర్ ను తొలగించడం, కేంద్ర బీసీ బడ్జెట్ ను 2.5 వేల కోట్ల నుండి 2 లక్షల కోట్లకు పెంచడం, జాతీయ స్థాయిలో బీసీ ఉప ప్రణాళికలను ప్రారంభించడం వంటి అంశాలతో కూడిన 13 సూత్రాల తీర్మానాన్ని సెమినార్ లో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సెమినార్ లో విశ్వబ్రహ్మణ, యాదవ, గౌడ్, ముదిరాజ్, రజక, నాయి బ్రాహ్మణ, వివిధ బీసీ సంస్థల నాయకులతో పాటు ఇతర సామాజిక వర్గాలకు ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పట్టణాన్ని రక్షించుకుందాం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రపంచంలో గొప్ప నగరాల్లో ఒకటిగా పేరుగాంచిన సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నేడు అనేక అక్రమ నిర్మాణాలు, అవినీతి పట్టణ ప్రణాళికలో జరుగుతున్న లోపాల వల్ల తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు మేము ప్రజాస్వామ్యబద్ధమైన, శాంతియుత ఉద్యమానికి సిద్ధమయ్యాము. గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని నాశనం చేస్తున్న అక్రమ నిర్మాణాలు, వాటిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల బాధ్యతపై ప్రశ్నించే ఉద్యమం. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై పారదర్శక విచారణ జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాము. నగరంలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నప్పటికీ, వాటిపై చట్టపరమైన చర్యలు, సీజ్‌లు లేదా కూల్చివేతలు తగిన స్థాయిలో కనిపించడం లేదని సూరన్న, సురేష్, దేవేందర్ అన్నారు.

### ప్రజల నుంచి వస్తున్న ప్రధాన ప్రశ్నలు:

ప్రజావాణిలో నమోదవుతున్న ఫిర్యాదులపై ఎందుకు సకాలంలో చర్యలు తీసుకోవడం లేదు.? అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు.? అనుమతులు లేకుండా నిర్మిస్తున్న సెల్లార్లు, సెట్బ్యాక్‌లు పాటించకుండా నిర్మిస్తున్న భవనాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.?

చట్టాన్ని ఉల్లంఘిస్తున్న నిర్మాణాలను ఎందుకు సీజ్ చేయడం లేదు.? పట్టణ ప్రణాళిక వ్యవస్థలో పూర్తి పారదర్శకతను ఎప్పుడు తీసుకువస్తారు.? ఈ ప్రశ్నలకు మున్సిపల్ శాఖ మంత్రి రేవంత్ రెడ్డి, ఉన్నత అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని సూరన్న డిమాండ్ చేశారు.

# కమిషన్ల కోసమే సీసీ రోడ్లా.?

- తార్నాక-మెట్టుగూడలో నాణ్యతలేని పనులపై స్థానికుల ఆగ్రహం
- రోడ్డు పూర్తయిన డిస్మెంటల్ తొలగించక వాహనదారుల అవస్థలు
- సీసీ రోడ్డుకు క్యూరింగ్ లేకుండానే నిర్మాణాలు
- ఏఈ, డీఈ, ఈఈల పర్యవేక్షణ ఎక్కడ.?
- క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు కాగితాలకే పరిమితమా.?



తార్నాక (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజల సౌకర్యం కోసం చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చాల్సింది పోయి ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని తార్నాక,మెట్టుగూడ సర్కిల్‌లో ఇటీవల చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో తీవ్ర నాణ్యత లోపాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.





పాత రోడ్ల డిస్మెంటల్ పూర్తిగా తొలగించకుండానే కొత్త సీసీ రోడ్లు వేయడం, నీటి క్యూరింగ్ తూతో మంత్రంగా చేయడం, పనులు పూర్తికాకముందే పగుళ్లు కనిపించడం, రోడ్డు పూర్తయిన నీటి క్యూరింగ్ చేయకున్నా వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా డిస్మెంటల్ పెట్టడం, నాణ్యత లేక మరమ్మత్తులు చేయాల్సిన స్థితి రావడం అధికారుల పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది.సాధారణంగా సీసీ రోడ్డు నిర్మాణానికి ముందు పాత పొరను పూర్తిగా తొలగించి, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా బేస్‌ను సిద్ధం చేయాలి. అనంతరం నాణ్యమైన కాంక్రీట్‌తో నిర్మాణం చేపట్టి, నిర్దిష్ట కాలం పాటు నీటి క్యూరింగ్ చేయాలి. అయితే తార్నాక,మెట్టుగూడ సర్కిల్ ల పరిధిలో ఈ నిబంధనలు పాటించకుండా హడావుడిగా పనులు పూర్తిచేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. క్యూరింగ్ సరిగా చేయకుండానే రోడ్లను ప్రజల వినియోగానికి తెరవడం వల్ల కొద్ది రోజుల్లోనే మరమ్మత్తులు చేపట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. మరమ్మత్తులతో సరిపోయే రోడ్లకు పూర్తిస్థాయి సీసీ రోడ్లు వేయడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు. నిజంగా ప్రజల అవసరమా.? లేక కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసి కమిషన్లు పొందడానికే ఇలాంటి పనులు చేస్తున్నారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ధనం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న పనుల్లో ఇలాంటి నిర్లక్ష్యం ఎలా చోటుచేసుకుంటోందని ఆగ్రహం వ్యక్తమవుతోంది.పనులను పర్యవేక్షించాల్సిన ఏఈ, డీఈ, ఈఈ, ఎస్ ఈలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారా.? లేక కార్యాలయాల్లో కూర్చొని ఫైళ్లకే పరిమితమవుతున్నారా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించి ఉంటే ఇలాంటి నాణ్యత లోపాలు బయటపడేవి కాదని స్థానికులు పేర్కొంటున్నారు.అంతకంటే కీలకమైన అంశం క్వాలిటీ కంట్రోల్ విభాగం పాత్ర, నాణ్యత పరీక్షలు నిజంగా జరుగుతున్నాయా.? కాంక్రీట్ బలం, మందం, ప్రమాణాలపై పరీక్షలు నిర్వహిస్తున్నారా.? లేక కాగితాలపై మాత్రమే నివేదికలు సిద్ధమవుతున్నాయా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాసిరకం పనులు జరిగినా పరీక్షల్లో "ఓకే" ఎలా వస్తోంది.? క్వాలిటీ కంట్రోల్ అధికారుల బాధ్యత ఏమైంది.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ఎవరికైనా అక్రమ లాభాలు చేరుతున్నాయా అనే అనుమానాలు కూడా స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి.ప్రజా సొమ్ముతో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో ఉండాల్సిందే తప్ప, కాంట్రాక్టర్లు,అధికారుల కుమ్మక్కుతో కమిషన్ల కోసం జరిగే పనులుగా మారకూడదు. ఇప్పటివరకు తార్నాక,మెట్టుగూడ సర్కిల్‌లో జరిగిన సీసీ రోడ్ల పనులపై ప్రత్యేక క్వాలిటీ పరీక్షలు నిర్వహించాలని ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపి, నాణ్యత పరీక్షలను స్వతంత్రంగా నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్లపై, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇంజినీరింగ్, క్వాలిటీ కంట్రోల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే అభివృద్ధి పేరుతో ప్రజాధనం దుర్వినియోగం అవుతూనే ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు.

# బియ్యం ధరలకు బ్రేక్

ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే విక్రయాలు

సామాన్యుడికి ఊరట కలిగించే నిర్ణయం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి(ప్రశ్న న్యూస్) బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు ఊరట కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీ నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని విక్రయించనున్నట్లు ప్రకటించగా, ఈ నిర్ణయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వాగతించారు.కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సామాన్య ప్రజల పక్షాన నిలుస్తుందనే విషయాన్ని ఈ నిర్ణయం మరోసారి స్పష్టం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న ధరల ప్రభావం ప్రజలపై పడకుండా పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకుని అందుబాటు ధరల్లో బియ్యం విక్రయానికి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కిలో రూ.52, గ్రేడ్--1 పచ్చి బియ్యం (రా రైస్) కిలో రూ.50 ధరకు ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించిన అనంతరం ఈ ధరలను నిర్ణయించినట్లు వెల్లడించింది.సామాన్య కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించడం ద్వారా వినియోగదారులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని, ఆగస్టు 1 నుంచి ప్రారంభమయ్యే ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు ప్రజల నిత్యావసరాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ధరల నియంత్రణకు తీసుకుంటున్న ఇటువంటి చర్యలు సామాన్యులకు మరింత భరోసా కల్పిస్తాయని పవన్ కళ్యాణ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ముసుగులో గుండాయిజం.?

- దాము మహేందర్ యాదవ్ గుండాలతో రిపోర్టర్‌పై దాడి
- ఒకేరోజు కావాలని 4సార్లు దాడి చేసిన మహేందర్ యాదవ్ ఆయన గుండాలు
- సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు తర్వాత కూడా ఫిర్యాదు చేస్తావా అంటూ దాడి చేసిన వైనం
- వీళ్లకు పోలీసులంటే లెక్కలేదు. చట్టాలంటే భయం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జ్ మధుయాష్కి గౌడ్ అండతో గుండాయిజం
- మరణాయుధాలు తో దాడి, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని జర్నలిస్టు సంఘాల డిమాండ్
- జర్నలిస్టుల భద్రతకు ముప్పు తలపెడుతున్న వారిపై కఠిన చర్యలేవి.?
- దాడిని తీవ్రంగా ఖండించిన తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) హైదరాబాద్ సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాగ ఫణీంద్ర జర్నలిస్టుపై ఒకే రోజు కావాలని నాలుగు సార్లు దాడి చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి (అఫీషియల్ స్పోక్స్‌పర్సన్) దాము మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో కొందరు వ్యక్తులు (దాదాపు 20 మంది వరకు) జర్నలిస్టు దామెర నాగ ఫణీంద్రపై దాడి చేయడం తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ ఘటనను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎలాంటి సంబంధం లేని అంశంలో రౌడీ మూకలను పురికొల్పి జర్నలిస్టుపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జ్ మధుయాష్కీ గౌడ్ అనుచరలం అంటూ అధికార పార్టీ పేరును అడ్డం పెట్టుకుని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజాలను వెలికితీసే పాత్రికేయులపై కావాలని మరునాయధాలతో భౌతిక దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జర్నలిస్టు సంఘాలు పేర్కొంటున్నాయి.ఈ ఘటనపై సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సాధారణ కేసులతో సరిపెట్టకుండా హత్యాయత్నం (అటెంప్ట్ టు మర్డర్) కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తర్వాత కూడా మాపై ఫిర్యాదు చేస్తావా అంటూ మరల దాడికి పాల్పడడం చూస్తుంటే పోలీసులన్నా, పోలీసుల చట్టాలన్న వీరికి ఏమాత్రం లెక్కలేకుండా పోయిందని, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తర్వాత కూడా దాడి చేయడం అంటే ఇక వాళ్ల రౌడీయిజం ఎంత తీవస్తాయిలో పెరిగిందో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అర్థం చేసుకోవాలి. మహేందర్ యాదవ్ తో పాటు దాదాపు 20 మంది వరకు గూండాలతో నాలుగు సార్లు దాడికి పాల్పడ్డారంటే శాంతి భద్రతలో విఘాతం కలిగించడం కాదా ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించకుంటే రేపు బహిరంగంగా హత్యలు చేసే పద్ధతిని ఎంచుకుంటారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాడిలో పాల్గొన్న వాళ్లు గంజాయి, మద్యం సేవించారన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు వాళ్లకు రక్త పరీక్షలు చేయించాలని, ఇలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికార పార్టీ కి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జ్ మధుయాష్కీ గౌడ్ అండ ఉందనే ధైర్యంతో కొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ప్రజలకు రక్షణ ఎక్కడ దొరుకుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించే వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ నాయకులము అంటూ రౌడీయిజం చేస్తూ విర్రవీగుతూ మీడియా స్వేచ్ఛపై దాడులు సహించబోమని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం స్పష్టం చేసింది.జర్నలిస్టు దామెర నాగ ఫణీంద్రపై జరిగిన దాడిని ఖండిస్తూ పలువురు పాత్రికేయులు సంఘీభావం ప్రకటించారు. ఈ ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇదే క్రమంలో టీజేఎస్ఎస్ ప్రతినిధులు గౌటి రామకృష్ణ, గంగి కృష్ణ, సతీష్, వాణి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అధికారులను కలిసి, దాడికి సంబంధించి హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. దాము మహేందర్ యాదవ్ రౌడీయిజం పై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, అధ్యక్షుడు మహేష్ గౌడ్ స్పందించి, వాస్తవాలను వెలికితీసి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడినందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకొని, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వారిని సస్పెండ్ చేయాలని పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టి, నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నదే ప్రజలు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




# స్టింగ్, రెడ్‌బుల్‌కు షాక్

-'ఎనర్జీ డ్రింక్' పదం వాడొద్దని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అధిక కెఫిన్ కలిగిన పానీయాలను 'ఎనర్జీ డ్రింక్స్'గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పెప్సీ, రెడ్ బుల్, మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి 'ఎనర్జీ డ్రింక్' అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90 రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్' పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. 'శరీరానికి, మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది' లేదా 'శారీరక బలహీనతను తగ్గిస్తుంది' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడింది. బ్రాండింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో గతంలోనే రెడ్ బుల్, పెప్సీకోకు చెందిన స్టింగ్, రిలయన్స్ క్యాంపా ఎనర్జీ వంటి బ్రాండ్‌లకు సంస్థ నోటీసులు జారీ చేసింది.ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈఓ రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది. దేశీయంగా ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా 2017లో పెప్సీ కంపెనీ తక్కువ ధరకే 'స్టింగ్' బ్రాండ్‌ను పరిచయం చేయడంతో యువతలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటికి ఆదరణ గణనీయంగా పెరిగింది. యూరోమానిటర్ అంచనాల ప్రకారం, 2028 నాటికి భారత ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ విలువ 1.6 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది.

# తార్నాకలో యూటర్న్ కష్టాలు

- ప్రజలకు నరకయాతనగా స్కూలు వేళలు
- యూటర్న్ కోసం అరగంట నిరీక్షణ
- తాజా కిచెన్ వద్ద యూటర్న్ మూసివేత పెరిగిన ట్రాఫిక్ కష్టాలు
- లాలాపేట బ్రిడ్జి నుంచి సెంటెన్స్ స్కూలు వరకు ట్రాఫిక్ జామ్
- ఫుట్‌పాత్ ఆక్రమణలు కనిపించవా.?

యూటర్న్ ఉంటే ట్రాఫిక్ పోలీసులకు సమస్యలా.?



తార్నాక (ప్రశ్న న్యూస్)హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు మరిన్ని ఇబ్బందులు కలిగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తార్నాక సెంటెన్స్ స్కూలు సమీపంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ముఖ్యంగా స్కూలు ప్రారంభం, ముగింపు సమయంలో యూటర్న్ చేసేందుకు వాహనదారులు అరగంటకుపైగా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తాజా కిచెన్ హోటల్ వద్ద గతంలో ఉన్న యూటర్న్‌ను మూసివేయడం వల్ల ట్రాఫిక్ మొత్తం సెంటెన్స్ స్కూలు జంక్షన్‌పై పడుతోంది. ఫలితంగా లాలాపేట బ్రిడ్జి నుంచి సెంటెన్స్ స్కూలు వరకు తార్నాక చౌరస్తా వరకు వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర సేవలకు వెళ్లే ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుని విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. ట్రాఫిక్‌ను సులభతరం చేయాల్సిన అధికారుల నిర్ణయాలే సమస్యను మరింత జటిలం చేస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.తాజా కిచెన్ హోటల్ వద్ద యూటర్న్ తిరిగి ఏర్పాటు చేస్తే పెద్దఎత్తున వాహనాలు అక్కడే తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉందని స్థానికులు సూచిస్తున్నారు. దీంతో సెంటెన్స్ స్కూలు జంక్షన్‌పై పడుతున్న ఒత్తిడి గణనీయంగా తగ్గి ట్రాఫిక్ కూడా సాఫీగా సాగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రజల నుంచి ఎన్నోసార్లు వినతులు వెల్లినా నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు స్పందించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.ఇదిలా ఉంటే ఫుట్‌పాత్‌లపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, రోడ్లపై అనధికార వ్యాపారాలు, వాహనాల అక్రమ పార్కింగ్‌లను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. పాదచారులు నడిచే మార్గాలే ఆక్రమణలకు గురై రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడినా కనీస చర్యలు ఎక్కడ కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ ప్రజలకు ఉపయోగపడే యూటర్న్‌లను మాత్రం మూసివేయడమే ట్రాఫిక్ నిర్వహణగా భావించడం విడ్డూరమని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.డెక్కన్ హోటల్ పరిసరాల్లో రాత్రి సమయంలో రోడ్లపైనే వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోంది. అయినప్పటికీ అక్కడ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాజా కిచెన్ హోటల్ వద్ద వెంటనే యూటర్న్‌ను పునరుద్ధరించాలని, డెక్కన్ హోటల్ వద్ద అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా తొలగించాలని, ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని స్థానికులు, వాహనదారులు ప్రభుత్వాన్ని, ట్రాఫిక్ పోలీసులను కోరుతున్నారు. ప్రజల సౌకర్యమే లక్ష్యంగా ట్రాఫిక్ నిర్వహణ ఉండాలే తప్ప, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలు కాకూడదని వాహనదారులు స్పష్టం చేస్తున్నారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588